
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 1 జూలై 2025



చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్లు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.5
కనిష్ఠం	24.4

ఈ డాక్టర్లు ఆరోగ్య రక్షకులు 7

వైటీపీఎస్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి 6

బోధనాసుపత్రుల బాగుకు ఏంచేద్దాం?
● ఎంసీఎంసీ తనిఖీల అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందజేత



రైల్వే చార్జీలు స్వల్పంగా పెరుగుదల

నేటి నుంచి అమలు

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో రైల్వేది కీలక పాత్ర. మెరుగైన సేవలందించే దిశగా అడుగులు వేస్తున్న ఇండియన్ రైల్వే ప్రయాణికులపై కాస్త భారం మోపనుంది. ఐదేళ్లుగా స్థిరంగా ఉన్న రైలు టికెట్ ధరలను సవరించి, స్వల్పంగా పెంచింది. పెరిగిన టికెట్ ధరలు మంగళవారం నుంచి అమలు లోకి రానున్నాయి. అయితే 2013, 2020లో టికెట్ ధరల సవరణతో పోలిస్తే ప్రస్తుత పెంపు నామమాత్రమేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

సాధారణ, సెకండ్ క్లాస్ రైలు ప్రయాణంలో 500కిలోమీటర్ల లోపు ప్రయాణానికి టికెట్ ధరలను మార్పులు చేయలేదు. అంతకంటే ఎక్కువ దూరం ప్రయాణిస్తే కిలోమీటరుకు అరపైస చొప్పున పెంచుతున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఆర్డినరీ టికెట్ ధరలు కిలోమీటర్‌కు అర పైసా, సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్, ఫస్ట్‌క్లాస్ మెయిల్, ఎక్స్‌ప్రెస్ టికెట్ ధరను కిలోమీటర్‌కు ఒక పైసా, ఏసీ చైర్ కార్, ఏసీ త్రీ టైర్, ఏసీ టూ టైర్, ఏసీ ఫస్ట్‌క్లాస్ టికెట్ ధరలను కిలోమీటర్‌కు రెండు పైసలు ఇండియన్ రైల్వే పెంచింది. సబర్బన్ రైళ్లు, సీజనల్ టికెట్లపై 500 కిలోమీటర్లలోపు ప్రయాణ టికెట్లపై ఎటువంటి పెంపు లేదు. అయితే పెరిగిన ధరలు ప్రయాణికులపై పెద్దగా ప్రభావం చూపవని వినియోగదారుల సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

దశలవారీ పెంపు కోసమేనా?..

ప్రయాణికులపై ప్రభావం పడకుండా దశలవారీగా టికెట్ ధరల పెంపునకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు సమాచారం. రైల్వే సహాయ మంత్రి సోమన్న ఇటీవల చేసిన ప్రకటన ప్రకారం దశలవారీగా రైల్ టికెట్ ధరలను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం...

- మిగతా 7వ పేజీలో...

చినుకు.. కినుక



వర్షాలు లేక ఎదగని పత్తి మొలకలు

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో ముందుగా మురిపించి ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మే నెల ఆఖరి వారంలో ముందస్తు వర్షాలు కురవగా, జూన్ నెల మొత్తం వర్షాల జాడలేదు. ఆకాశంలో మబ్బులు ఊరిస్తున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

» 2.22లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు » జూన్‌లో 30.1మి.మీల వర్షం లోటు » ఈనెల 15 వరకు పత్తి విత్తనాలు విత్తే అవకాశం

వానాకాలం సీజన్‌లో పూర్తిస్థాయిలో విత్తనాలు విత్తడంతో పాటు మొక్కలు ఏపుగా ఎదగాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం పరిస్థితులు అందుకు విరుద్ధంగా విత్తిన విత్తనాలు భూమిలోనే మాడిపోతున్నాయి. కొన్ని చోట్ల పత్తి మొలకలు వచ్చినా ఎదుగు బొదుగు లేకుండా ఉన్నాయి. ఆకాశంలో మేఘాలు దట్టంగా కనిపించడం, చిరు జల్లులు కురిసి చల్లటి వాతావరణం ఏర్పడం మినహా భారీ వర్షాలు లేవు. ఓ మోస్తరు వర్షాలు కురిసినా విత్తనాలు విత్తే వీలుంటుంది. ప్రస్తుతం గాలులు వీయడం మినహా చినుకులు కరువయ్యాయి.

2లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి విత్తనాలు

జిల్లా వ్యాప్తంగా జూన్ మాసంలో 2.22లక్షల ఎకరాల్లో రైతులు పత్తివిత్తనాలు విత్తారు. 86ఎకరాల్లో మాత్రమే కంది వేయగా,4వేల ఎకరాల్లో రైతులు వరి నారుమడులు పోశారు. అయితే వర్షాలు లేక పత్తి విత్తనాలు మొలకెత్తకపోగా మొలకెత్తిన పత్తి మొలకలు ఎదగకుండా ఉన్నాయి. దీంతో 2.22లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తిన రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. జూన్ నెలలో 86.8మి.మీల వర్షపాతానికి 60.7మి.మీల వర్షం కురిసింది. ఈ నెలలో 30.1మి.మీల వర్షపాతం లోటుగా ఉంది. జూన్ మాసంలో దేవరకొండ డివిజన్‌లో చింతపల్లి, దేవరకొండ, గుండ్లపల్లి, చండూరు డివిజన్‌లోని మర్రిగూడ మండలంలో మాత్రమే కాస్తా అధికంగా వర్షాలు కురవగా, మిగతా అన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే లోటు వర్షపాతమే అధికంగా ఉంది.

పంటల దిగుబడులపై ప్రభావం

వర్షాలు నెల రోజుల పాటు కనుమరుగు కావడంతో విత్తనాలు ఆలస్యంగా విత్తుతుండటంతో పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపించనుంది. వానాకాలం సీజన్‌లో షెడ్యూల్ ప్రకారం విత్తనాలు విత్తకపోతే పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈనెల 15 వరకు పత్తి విత్తనాలు వేసేందుకు అనుకూలం. అయితే జూలై నెలాఖరు వరకు కూడా రైతులు విత్తనాలు వేసిన సందర్భాలు గతంలో ఉన్నాయి. పంట దిగుబడులు తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం. వర్షాలు సమృద్ధిగా కురిసి, ఎలాంటి తెగులు ఆశించకపోతే పత్తి దిగుబడులు ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు వస్తుంది. సకాలంలో...

- మిగతా 8వ పేజీలో...

పత్తి విత్తనాలు వేసినా మొలకెత్త లేదు



మే నెలాఖరులో కురిసిన వర్షాలతో పాటు జూన్‌లో అప్పుడప్పుడు కురిసిన వర్షాలతో పత్తి విత్తనాలు విత్తా. ఆ తరువాత వర్షాలు రాకపోవడంతో వేసిన విత్తనాలు మొలకెత్తలేదు. ఈ ఏడాది బాగా వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ పేర్కొన్నా వర్షాలు కురవడటం లేదు. దీంతో వేల రూపాయల పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ వారంలో వర్షాలు లేకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

- బెల్లంకొండ యాదగిరి, చిట్యాల మండలం, మోర్సుగూడెం

వర్షాలు లేక పత్తి మొక్కలు ఎదగడం లేదు



జిల్లాలో ప్రస్తుతం వర్షపాతం లోటుగా ఉండటంతో పత్తి మొలకలు ఎదగడం లేదు. రైతులు ఇప్పటికే 2.22 లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తారు. వర్షాలు కురవకపోవడంతో పత్తి మొలకల్లో ఎదుగుదల లేదు. జూలై మొదటి వారంలో వర్షాలు కురిస్తే రైతులు గట్టెక్కుతారు. ప్రస్తుతం రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాలు కురిశాక పత్తి మొక్కలకు ఎరువులు వేస్తే ఏపుగా ఎదుగుతాయి.

- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ నల్లగొండ

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు

కృషి చేయాలి

అదనపు ఎస్పీ జి.రమేష్

నల్లగొండ క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అదనపు ఎస్పీ బి.రమేష్ అన్నారు. సోమవారం నల్లగొండలోని జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ ముస్కాన్- 11 సమావేశంలో అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జూలై 1 నుండి 31 వరకు నెల రోజుల పాటు పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ వివిధ డిపార్ట్మెంట్ అధికారుల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా మూడు సబ్ డివిజన్ పరిధిలో మూడు టీమ్ లుగా ఏర్పాటు చేసి ఈఆపరేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలలోపు తప్పిపోయిన/ వదిలివేసిన, వివిధ రకాల బాల కార్మికులు కిరాణం షాప్ లలో, మెకానిక్ షాపులలో, హోటళ్లలో, వివిధ కంపనిలలో పనిచేస్తూ, రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు బాలకార్మికులుగా ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం లేదా స్టేట్ హోమ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఎవరైనా బాలల యొక్క స్వేచ్ఛకు, వికాసానికి భంగం కలిగించినా, వెట్టి చాకిరీ చేయించినా అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశ్రమలు, బ్రిక్స్ తయారీ, హోటల్స్ లాడ్జ్, మినరల్ వాటర్ సప్లై, దుకాణాలు, ధాబాలు ఇలా ఎక్కడైనా పిల్లలు వెట్టి చాకిరీకి గురైతే సంబంధిత యాజమాన్యాలపై కేసులు నమోదు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి, డిస్ట్రిక్ట్ లేబర్ ఆఫీసర్ అరుణ, ఏహెచ్‌టీయూ ఎస్ఐ రంగారెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి గణేష్, డీసీపీయూ సిబ్బంది తేజస్విని, రమణి, రాము, రేవతి, మహేష్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌తో చెర్వుగట్టు క్షేత్రాభివృద్ధి



ఉన్నత స్థాయి సమీక్ష నిర్ణయాలను విలేకరులకు తెలుపుతున్న శైలజరామయ్యర్

» త్వరలో ఆలయంలో కుంభాభిషేకం చేయిస్తాం
» దేవదాయ, ధర్మాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్

నార్కట్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు దేవస్థానాన్ని మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేస్తామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.వెంకట్రావ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ధార్మిక పరిషత్ ముఖ్య సలహాదారు గోవిందహళ్లితో కలిసి చెర్వుగట్టు పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. తొలిసారి ఇక్కడికి వచ్చిన శైలజారామయ్యర్, ఎమ్మెల్యే, అధికారులకు అర్చకులు ఆలయ మర్యాదల మేరకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రధానాలయం మూలవిరాట్టు సన్నిధిలో జరిగిన పూజల్లో పాల్గొని దేవస్థాన అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, వచ్చే 30 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని ఓ మాస్టర్ ప్లాన్ ప్రకారం క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతీ 12 ఏళ్లకు కుంభాభిషేకం నిర్వహించాలని శాస్త్రం చెబుతున్నాయని పేర్కొన్నారు. త్వరలో ముహూర్తం నిర్ణయించి చెర్వుగట్టులో కూడా కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. పండుగ రోజుల్లో భారీగా వచ్చే భక్తుల సంఖ్యతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నందున రెండో ఘాట్ రోడ్‌ను నిర్మిస్తామన్నారు. రూ.12కోట్ల అంచనాతో దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిరర్థకమనిపించేవి నిలిపివేయాలని నిర్ణయించామన్నారు. గుట్టపైన, కింద పార్కింగ్ స్థలాలు, భక్తుల కోసం డార్మెటరీల నిర్మాణం, స్థపతి సూచనల మేరకు టాయ్‌లెట్ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టాలని ఆమె సూచించారు. కల్యాణమండపం విస్తరణ, మూడుగుండ్లకు వెళ్లే దారిని నడకదారిగా మార్చాలని, శాస్త్రీయ పద్ధతిలో పుష్కరిణి, మెట్ల మార్గాన్ని, క్యూలైన్లను ఏర్పాటు చేస్తామన్నారు. దేవస్థానానికి భక్తులు విరాళాలు, కానుకల రూపంలో సమర్పించుకున్న నగదు డిపాజిట్లు రూ.24కోట్లు, బంగారం 2.640 కి.గ్రాముల బంగారం, 241 కిలోల వెండి ఉన్నట్లు రామయ్యర్ తెలిపారు. దేవస్థానాన్ని సహాయ కమిషనర్ హోదా నుంచి డిప్యూటీ కమిషనర్ హోదాకు పెంచే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ చెర్వుగట్టులో సరైన వసతులు కల్పించాలన్నారు. అమావాస్య రోజు భక్తులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తున్నారని, దీంతో సరైన వసతులు లేక అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. ధార్మిక పరిషత్ ప్రత్యేక సలహాదారు గోవిందహళ్లి సూచన మేరకు వచ్చే పరశురామ జయంతి నాటికి దేవాలయంలో ఏదైనా విశేషమైన కార్యక్రమం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట స్థపతి వల్లీయ నాగం, ఆర్కిటెక్చర్ సూర్యనారాయణ మూర్తి, ఎస్ఈ ఓంప్రకాశ్, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏసీ భాస్కర్‌రావు, దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, రేగట్టె నర్సింహారెడ్డి, నేతకాని కృష్ణయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, వారాల రమేశ్, రేగట్టె నవీన్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేశ్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

ఛాయా సోమేశ్వరుడి ప్రాముఖ్యాన్ని భద్రపరుస్తాం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): ఛాయా సోమేశ్వర ఆలయాలను భద్రపరుస్తామని శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం ఆమె పానుగల్ లోని ఉన్న శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ఛాయా సోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాక అభిషేకం చేశారు.

ఈ సందర్భంగా ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ ప్రత్యేకత పై ఏమైనా సాహిత్యం ఉంటే ఇవ్వాలని అడిగారు. దేవాలయ చరిత్ర ను తెలుసుకున్న ఆమె దేవాలయ ప్రాముఖ్యతను, అదేవిధంగా శిల్ప విశిష్టత, చరిత్ర అన్నింటిని భద్రపరిచేలా చూడాలని ఆర్కిటెక్చర్ సూర్యనారాయణమూర్తి, అలాగే ధార్మిక పరిషత్ సలహాదారు గోవింద హళ్లితో సూచించారు.

ప్రభుత్వ పథకాలు

అర్హులకు అందడం లేదు

మాజీ ఎమ్మెల్యే నోముల భగత్




వినతిపత్రం సమర్పించిన మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నల్లగొండ (కలెక్టరేట్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చాలామంది అర్హులకు అందడం లేదని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. దీనిపై అధికారులను అడిగితే తమకేమీ తెలియడం లేదని సమాధానం చెబుతున్నారని అన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తమ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల గురించి అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అందడం లేదనే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకురావడానికి ప్రయత్నిస్తే తమకు అందుబాటులోకి రావడం లేదన్నారు. కనీసం తమ ఫోన్ కూడా ఎత్తడం లేదని, మాజీ ప్రజాప్రతినిధులమైన తమకే ఇలాంటి పరిస్థితి ఉంటే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని అన్నారు. తిరుమలగిరి సాగర్ మండలంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారికి, రేషన్ డీలర్ కు మొదటి విడతలోనే ఇండ్లు ఇచ్చారని కానీ, నిరుపేదలకు మాత్రం ఇండ్లు రాలేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక అధికారులు స్పందించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూడాలని కోరారు.

మేలు రకం విత్తనంతోనే
మెరుగైన పంట
● పంటల సాగులో విత్తన ఎంపికే ప్రధానం
● వానాకాలం సాగుకు రైతన్నల సమాయత్తం 7

కేతేపల్లి మండలంలో
విషాదఛాయలు
● స్వగ్రామాలకు చేరిన మృతదేహాలు 6

వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపాలి



ఆయిల్‌పాం మొక్కనాటి నీరుపోస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టర్ ఇలా త్రిపాఠి


నల్లగొండ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వరికి ప్రత్యామ్నాయంగా, అధిక దిగుబడి , ఆదాయాన్నిచ్చే సులభతరమైన, వాణిజ్య పంట ఆయిల్ పాంను సాగు వైపు మొగ్గు చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆమె నల్లగొండ మండలం దండెంపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటరెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో 12.5 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టగా, కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొని మొదటి మొక్కను నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కను ఒకసారి నాటితే 4 వ సంవత్సరం నుంచి నిర్విరామంగా 30 సంవత్సరాల వరకు సరాసరిన ఎకరానికి 10 నుండి 12 టన్నుల దిగుబడిని తీసుకోవచ్చన్నారు. అంతేకాక ఎకరానికి లక్ష ఇరవై వేల నుంచి లక్ష యాభై వేల వరకు నికర ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్ పంటకు జంతువుల నుండి దొంగల నుండి ఎటువంటి బెడద ఉండదని, ఆయిల్ పామ్ వేసిన రైతు ప్రతీ నెల ఆదాయాన్ని తీసుకునే సౌకర్యం ఉంటుందన్నారు. ఇతర పంటలలో ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలు ఎక్కువ అని, అదే ఆయిల్ పామ్‌లో చీడ, పీడల గొడవ ఉండదని, ఈ మొక్కలు ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకొని నిలబడగలుగుతాయని అన్నారు.

ప్రభుత్వం నుంచి ఆయిల్‌పామ్ పంట సాగుకు 100 శాతం రాయితీతో మొక్కలు సరఫరా చేయడమే కాకుండా, మొక్కకు నీరు అందించే డ్రిప్ పరికరాలను రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేగాక మొదటి నాలుగు సంవత్సరాలకు మొక్కల యాజమాన్యానికి ఎకరానికి 4200 రూపాయల చొప్పున ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రైతు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. భూమి, నీటి వనరులు ఉన్న ప్రతీ రైతు సాంప్రదాయ వ్యవసాయ పంటల నుంచి ఆయిల్ పామ్, ఉద్యాన పంటల వైపు రావాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి పిన్నపురెడ్డి అనంత రెడ్డి , పతంజలి ఫుడ్స్ జిల్లా జనరల్ మేనేజర్ యాదగిరి, ఉద్యాన అధికారులు, శ్వేత, రిషిత, నసీమా మరియు ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు ప్రసాద్, మనోహర్, భారత్, రైతులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదుల

పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



ఫిర్యాదులను తీసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ (కలెక్టరేట్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సోమవారం మొత్తం 122 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు 67, రెవెన్యూ శాఖకు 55 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఎప్పటిలాగే ఎక్కువ ఫిర్యాదులు వ్యక్తిగత విషయాలకు సంబంధించి, భూములకు సంబంధించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి ఉన్నాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, ప్రజావాణి ఫిర్యాదులతో పాటు, ముఖ్యమంత్రి ఫిర్యాదులు, తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఈ వేణుగోపాలాచార్యులు

విద్యుత్ భద్రత సూచనలు పాటించాలి

ఏడీఈ ఎం.వేణుగోపాలాచార్యులు

నల్లగొండ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ భద్రత పాటించాలని నల్లగొండ ఏడీఈ ఎం.వేణుగోపాలాచార్యులు అన్నారు. సోమవారం టౌన్-1 కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ భద్రతా వారోత్సవాల కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 26 నుంచి జూలై 2 వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే విద్యుత్ అధికారులను సంప్రదించాలన్నారు. వర్షాకాలంలో ఈదురుగాలులు, ప్రకృతి వైపరీత్యాలతో తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిపడిన స్తంభాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పంట పొలాల్లో విద్యుత్ తీగలు తెగినప్పుడు సంబంధిత విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందరన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈలు, లైన్‌మన్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పత్తి విత్తనాలు వాడిపోకుండా నీటిని వెదజల్లుతున్న స్ప్రింక్లర్లు

తడి ఆరకుండా జల్లులు

● పత్తి విత్తనాలు మాడిపోకుండా తుంపర సేద్యం

(ఆంధ్రజ్యోతి-చింతలపాలెం)

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో వారం రోజులుగా ఒక మోస్తరు వర్షం కూడా పడలేదు. పత్తి విత్తనాలు నాటి నాలుగు రోజులైనా చినుకు జాడ లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విత్తనం మొలకెత్తే పరిస్థితులు కనిపించకపోగా, భూమిలోనే మాడి పోయే ప్రమాదం నెలకొంది. ఇలాగే వర్షాలు మరో నాలుగు రోజులు పడకుంటే మరోసారి దుక్కి దున్ని విత్తనం విత్తాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఎకరానికి విత్తనాలు విత్తేందుకు దాదాపుగా రూ.15 వేల వరకు ఖర్చు అయిందని, మరోసారి ఖర్చు చేయాల్సి వస్తోందేమోనని ఆందోళన చెందుతున్నారు. పలువురు రైతులు తమ పంటను కాపాడుకోవడానికి తుంపర సేద్యం(స్ప్రింక్లర్ల)పై ఆధారపడుతున్నారు. నాలుగు రోజుల కిందట ఒక మోస్తరుగా కురిసిన వర్షానికి రైతు ఎర్రబోలు నరసింహారెడ్డి నాలుగు ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటాడు. నాటిన విత్తనాలు మొలకెత్తవేమో అనే భయంతో సుమారు రూ.60,000 వ్యయంతో తుంపరలుగా నీటిని వెదజల్లే యంత్రాలను తెచ్చి పొలాన్ని తడుపుతున్నాడు.

బోధనాసుపత్రుల బాగుకు ఏంచేద్దాం?

● ఎంసీఎంసీ తనిఖీల అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందజేత

● అందుకు అనుగుణంగా నిధులు, సౌకర్యాలు

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాసుపత్రుల అభివృద్ధికిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రైవేట్ వైద్య కళాశాలలతో పోలిస్తే ప్రభుత్వ వైద్య కళాశాలల పనితీరు తీసికట్టుగా ఉందని జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వాటి నిర్వహణలో నెలకొన్న సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందులు, పరిష్కార మార్గాలు, బోధనాసుపత్రులకు రోగుల సంఖ్యను పెంచేందుకు తీసుకోవలసిన చర్యల నిమిత్తం ప్రభుత్వం వైద్య కళాశాలల మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)లను ఏర్పాటుచేసింది. ఈ కమిటీలలో వైద్య ఆరోగ్య శాఖ హెచ్ఎండీ, కార్యదర్శి స్థాయి అధికారులతో ఏర్పాటుచేసిన కమిటీలలో జిల్లా కలెక్టర్, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాల్ సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ఆయా కమిటీలు ప్రభుత్వ వైద్యకళాశాలలు, బోధనాసుపత్రులను తనిఖీ చేసి కళాశాలల వారిగా వైద్యారోగ్య శాఖకు నివేదిక అందజేస్తాయి. నివేదికలు ఆధారంగా జూన్ 2028 నాటికి అన్నిరకాల సమస్యలు పరిష్కరించి పూర్తిస్థాయి వసతులను కల్పించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. కాగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భువనగిరి, నల్లగొండ, సూర్యాపేటలో వైద్య కళాశాలలు ఉన్నాయి. త్వరలో జరుగనున్న ఎంబీబీఎస్ కౌన్సిలింగ్, కళాశాలల అనుమతుల రెన్యూవల్, సీట్ల పెంపు దరఖాస్తుల పరిశీలన తదితర లక్ష్యాలతో ఎన్ఎంసీ తనిఖీల ప్రారంభం ముందు ఎంసీఎంసీ బృందాలు తనిఖీ అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులలో సమస్యలు తీరుతాయని అధికారులు భావిస్తున్నారు. కాగా 50 సీట్లతో గత విద్యా సంవత్సరంలో ప్రారంభమైన భువనగిరి ప్రభుత్వ వైద్య కళాశాలకు ఈ సంవత్సరం కూడా ఎన్ఎంసీ అనుమతులను రెన్యూవల్ చేయగా సీట్ల పెంపు మాత్రం మొదటి బ్యాచ్ పాస్ అవుట్ అయ్యాకే ఉంటుంది.



సూర్యాపేటలోని వైద్యకళాశాల

భువనగిరి కళాశాలలో

భువనగిరి ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాసుపత్రిలో ఇటీవల వరకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో బోధనాసుపత్రిలో పనితీరు మెరుగుపడలేదు. అలాగే అద్దె భవనంలో కొనసాగుతున్న వైద్యకళాశాలలో కూడా ఉద్యోగ ఖాళీలు, ల్యాబ్‌ల ప్రమాణాలు దిగదుడుపుగా ఉన్నాయని మెడికోలు ఆరోపిస్తున్నారు. అలాగే కళాశాల మొదటిబ్యాచ్‌కు చెందిన ద్వితీయ సంవత్సరం వైద్య విద్యార్థులకు భువనగిరిలోని బోధనాసుపత్రిలో క్లినికల్ పోస్టిం ... ప్రారంభం కానున్నాయి. ఇందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. వైద్య, ఆరోగ్య శాఖ మూడు నెలలం క్రితం రూ.కోట్లు వ్యయం చేసి సిటీ స్కాన్ అందించినా టెక్నీషియన్ల కొరత, హైపర్ కనెక్షన్ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఓపీ, ఐపీకి అనుగుణంగా వసతులు లేని పరిస్థితి నెలకొంది. వైద్యులు, అధికారులు, నర్సింగ్, ఇతర సిబ్బంది ఖాళీలు, పారిశుద్యం తదితర ఇబ్బందులు వెంటాడుతున్నాయి. పేరుకే బ్లడ్ బ్యాంక్ ఉన్నప్పటికీ రోగులకు అందుతున్న సేవలు కనుచూపుమేరలో లేని లేవు. ఎంసీఎంసీలలో కలెక్టర్ కీలకపాత్ర పోషించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు వాటి పాలనలోనూ కలెక్టర్లకు కీలక బాధ్యతలు అప్పగించడం, ఎంసీఎంసీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుండటంతో నిర్వహణ తీరు మెరుగుపడి రోగులకు, వైద్య విద్యార్థులకు మేలు జరుగుతుందని వైద్యశాఖ అధికారులు భావిస్తున్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

ఆత్మకూరు(ఎం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : భార్య చనిపోయిందన్న బాధ ఓ వైపు, ఆరోగ్యం బాగ లేక తనను చూసే వారు లేరన్న మానసిక ఆవేదన మరోవైపు జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంకేంద్రంలో సోమవారం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన బీరు శ్రీను(65) కూలిపని చేస్తూ జీవనం సాగించేవాడు. పేద కుటుంబానికి చెందిన శ్రీనుకు మండలకేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో ప్రభుత్వం ఇల్లు మంజూరుచేసింది. శ్రీనుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెల వివాహాలయ్యాయి. కాగా 10 నెలల కిందట శ్రీను భార్య జయమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆ దిగులుతో శ్రీనుకు పక్షవాతానికి గురయ్యాడు. అనారోగ్యంతో శ్రీను ఇంట్లో ఒక్కడే ఒంటరిగా మంచానికి పరిమితమయ్యాడు. దీంతో మానసికంగా కుంగిన శ్రీను జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో పడుకునే బెడ్‌కు ఆనుకుని ఉన్న కిటికీకి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కింటి బాలుడు చూసి వారి ఇంట్లో చెప్పగా ఇంటివారు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీను అన్న కుమారుడు బీరు నరేష్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ...

నార్కట్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసున్న వ్యక్తి నల్లగొండ రోడ్‌లోని ఓ కోళ్లఫాం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహంపై చేతికి కంకణం, జంజము ఉండగా, మెడలో తాయెత్తు ఉందని ఎడమ చేతికి గోరింటాకు పెట్టి ఉందని ఎస్ఐ తెలిపారు. ప్యాంట్ ధరించి ఉన్నాడని, తను షర్ట్‌తోనే ఉరేసుకున్నాడని, మృతదేహం గుర్తింపు కోసం సమాచారం పంపినట్లు ఎస్ఐ తెలిపారు. నల్లగొండలోని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరుస్తున్నామని ఎస్ఐ చెప్పారు. ఆనవాళ్లు తెలిసిన వారు తమను సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కొత్తపేట/ నేరేడుచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో నాలుగు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత గాంధీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకోగా

సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రియుడి వల్లే ఆమె ఆత్మహత్యాయత్నం చేసిందని, అతడికి వీడియోకాల్ చేసి మరీ ఆమె ఆత్మహత్యాయత్నం చేసిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం బోడలదిన్నెకు చెందిన దంపతులు అశ్విని(35)తో కలిసి హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఉంటున్నారు. నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె వారి గ్రామానికి చెందిన తెలిసిన వ్యక్తికి వీడియోకాల్ చేసి, చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తెలిపింది. వారి గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో విషయం తెలుసుకున్న వెంటనే అశ్విని ఇంటికి వెళ్లి పక్కంటి వారి సహకారంతో ఆమెను కాపాడేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో భర్త వచ్చాడు. ఆమె భర్తతో కలిసి చికిత్స నిమిత్తం అశ్విని తొలుత దగ్గరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులుగా అక్కడ చికిత్స పొందుతున్న అశ్విని ఆదివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అలాంటిదేమీ మా దృష్టికి రాలేదు..

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విధంగా మృతురాలిని రక్షించే యత్నం చేసిన సదరు యువకుడితో వివాహేతర సంబంధం ఉందని, అతడి వల్లే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందనే విషయాలేవీ తమ దృష్టికి రాలేదని ఇన్‌స్పెక్టర్ వినోద్ తెలిపారు. భార్య ఆత్మహత్యాయత్నం చేసిందని మాత్రమే భర్త ఫిర్యాదుచేశాడని, ఆ యువకుడికి సంబంధించిన ఎలాంటి విషయాలు వెల్లడించలేదని, ఫిర్యాదులోనూ పేర్కొనలేదని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. ఆమె తరఫు కుటుంబ సభ్యులెవరూ కూడా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

మృతదేహంతో ప్రియుడి ఇంటి ఎదుట నిరసన

అశ్విని మృతికి గ్రామస్థుడే కారణమని ఆమె కుటుంబసభ్యులు ఆదివారం రాత్రి బోడలదిన్నె గ్రామంలోని గ్రామస్థుడి ఇంటి వద్ద అశ్విని మృతదేహంతో నిరసన తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంఘటనా స్థలానికి చేరుకుని వారికి సర్దిచెప్పారు. అనంతరం అశ్విని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

భవనం పైనుంచి పడి మధ్యప్రదేశ్ కూలీ..

గుండాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఇంటి నిర్మాణంలో ఉన్న కూలీ భవనం పైనుంచి పడి మృతి చెందాడు. ఎస్ఐ సైదులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాగడ్ జిల్లా అర్ననపూర్ గ్రామానికి చెందిన సహబ్ లాల్(58) సోమవారం భవన నిర్మాణంలో కూలి పనికి వెళ్లాడు. రెండో అంతస్తులో రేలింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సహబ్ లాల్ ఐదేళ్లుగా హైదరాబాద్‌లోని కొంపల్లిలో నివాసముంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లి ఆదివారం గుండాలకు వచ్చాడు. సోమవారం కూలికి వెళ్లి పని చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. అతడి భార్య బాగుబాయి బహేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

నెమ్మానిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

● సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు అపహరణ



దొంగలు చిందరవందర వేసిన దుస్తులు

నార్కట్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం నెమ్మానిలో భారీ చోరీజరిగింది. సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఎస్ఐ కాంత్రికుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అటవీశాఖకు చెందిన విశ్రాంత ఉద్యోగి గాలి యాదయ్య తన భార్య రమణతో కలిసి నెమ్మానిలో నివసిస్తున్నాడు. వారం రోజుల కిందటే తన ఇంటికి కొంత మరమ్మతులు చేయించాడు. కాగా శనివారం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి సోమవారం మధ్యాహ్నం వచ్చి తలుపు తీసి లోపలికి వెళ్లి చూసేసరికి ఇంట్లోని బెడ్‌రూంలో ఉన్న రెండు బీరువాల్లో పెద్ద బీరువాను తెరిచి అందులో ఉంచిన దుస్తులను బెడ్‌పై చిందర వందరగా పడేసి ఉండటాన్ని గమనించాడు. బీరువాలో దాచిన సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు 30 తులాల వెండి సుమారు రూ.20వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. చోరీకి సొత్తు విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. యాదయ్య ఫిర్యాదుతో సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్ఐ తెలిపారు. వేలిముద్రల నిపుణులు వచ్చి ఆధారాలు సేకరించారు.

ప్రభుత్వ నిధులతో హెలీకాప్టర్ కొనివ్వాలి

● మా పొలానికి వెళ్లేందుకు దారి లేదు



యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ ఆవరణలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

భువనగిరి (కలెక్టరేట్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తమ వ్యవసాయ భూముల్లోకి, ఇళ్లలోకి వెళ్లకుండా దారి కబ్జా చేశారని.. ప్రభుత్వ నిధులతో తమకు హెలికాప్టర్ కొనిచ్చి ఆదుకోవాలని బహద్దూర్‌పేట రైతులు అదనపు కలెక్టర్ వీరారెడ్డిని కోరారు. సోమవారం ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ బహద్దూర్‌పేట నుంచి చిన్న కందుకూరు గ్రామాన్ని కలిపే లింకు రహదారిని కొంతమంది అక్రమంగా కబ్జాచేశారని, రహదారికి అడ్డంగా పెద్ద బండరాళ్లను పెట్టి ఫెన్సింగ్ వేయించారని తెలిపారు. దీంతో నాలుగు ఎస్టీ కుటుంబాలకు చెందిన తాము ఇళ్లలోకి వెళ్లే దారిలేక ఇతరుల ఇళ్ల వాకిట తలదాచుకుంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయ భూముల్లోకి వెళ్లలేక విత్తనాలు విత్తలేక, వేసిన పంటలను రక్షించుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రోడ్డును ఆక్రమించటంతో రాకపోకలు నిలిచిపోవటంతో ప్రభుత్వ నిధులతో హెలికాప్టర్ కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని కోరారు. అక్రమంగా నక్ష బాటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, దారి సౌకర్యం కల్పించాలని కలెక్టరేట్ ఆవరణలో ప్లకార్డులను ప్రదర్శించారు. 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేసినవారిలో బహద్దూర్‌పేట గ్రామ రైతులు, ప్రజలు ఉన్నారు.

వైటీపీఎస్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

● నల్లగొండ జిల్లా వీర్లపాలెం గ్రామస్థుల ఆందోళన



దామరచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీర్లపాలెం గ్రామస్థులు

దామరచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ(వైటీపీఎస్)లో స్థానికులైన తమకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు పరిహారం అందించాలని వీర్లపాలెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు సమయంలో స్థానికులకు ఇంటికో ఉద్యోగంతోపాటు బాధిత గ్రామం కింద కుటుంబానికి రూ.5లక్షల పరిహారం చెల్లిస్తామని నాటి ప్రభుత్వం, అధికారులు తమకు హామీ ఇచ్చారని తెలిపారు. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ హామీ నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ మిర్యాలగూడలోని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు సుమారు 300మంది గ్రామస్థులు వాహనాల్లో తరలివెళుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు మార్గమధ్యలో వారిని అడ్డుకుని వెనక్కి వెళ్లాలని సూచించారు. దీంతో వారు అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ పీఎన్‌డీ.ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. అక్కడినుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న గ్రామస్థులు ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పరిశ్రమ ఏర్పాటు తొలినాళ్లలో భూ సర్వే సందర్భంగా తమ గ్రామంలోని ప్రతీ ఇంటికో ఉద్యోగంతోపాటు నష్ట పరిహారం అందిస్తామని ఆనాటి ప్రభుత్వం, అధికారులు హామీ ఇవ్వడంతో పరిశ్రమ ఏర్పాటుకు సానుకూలత వ్యక్తం చేశామన్నారు. సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ తమను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు.

బస్సు ఢీకొని ఒకరి మృతి

నార్కట్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రానికి శివారులోని రెడ్డయ్య కంపెనీ వద్ద సోమవారం జరిగింది. ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలంలోని పల్లెపహాడ్‌కు చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి కల్మెకొలను ధర్మారెడ్డి(65) తనతో పాటు మరో వ్యక్తితో కలసి వ్యాన్‌లో నార్కట్‌పల్లి వైపునకు వస్తున్నాడు. రాంగ్ రూట్‌లో ఎదురుగా వచ్చిన ఎస్వీఆర్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వ్యాన్‌ను ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ధర్మారెడ్డితో పాటు మరొకరికి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. ధర్మారెడ్డి కుమారుడు రాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చికిత్స పొందుతూ ..



జయరాజు(ఫైల్‌ఫొటో)

హుజూర్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జయరాజు(55) ఈనెల 12న విధులు ముగించుకుని కోదాడలోని ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. 18 రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. కాగా జయరాజు మృతి బాధాకరమని ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. జయరాజు అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన చిలుకూరు మండలం ఆరెగూడెంలో నిర్వహించారు. కాగా సర్కిల్ పోలీసులు జయరాజు అంత్యక్రియల్లో పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని సీఐ నాగార్జున రెడ్డి, ఎస్ఐలు అన్నారు.

కేతేపల్లి మండలంలో విషాద-ఛాయలు

● స్వగ్రామాలకు చేరిన మృతదేహాలు



బాలసుధాకర్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

కేతేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని కొండమడుగు రిసార్ట్‌లో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడగా, వారి మృతదేహాలను సోమవారం సాయంత్రం కేతేపల్లి మండలంలోని వారి స్వగ్రామాలకు చేర్చారు. చిన్ననాటి నుంచి కలిసి ఉంటున్న, బంధుత్వం కలిగిన రెండు కుటుంబాలకు చెందిన తమకు వివాహేతర సంబంధం అంటగట్టారనే కేతేపల్లి మండలకేంద్రానికి చెందిన బందా బాలసుధాకర్, పసల సుశ్మిల బీబీనగర్ మండలంలోని కొండమడుగు రిసార్ట్‌లో బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుల్లో ఒకరైన పసల సుశ్మిల పుట్టిల్లు కేతేపల్లి మండల కేంద్రం కాగా అత్తారిల్లు ఇదే మండలంలోని ఇనుపాముల గ్రామపంచాయతీ ఆవాసం రాయపురం గ్రామం. బందా బాలసుధాకర్ స్వగ్రామం కేతేపల్లి కాగా సుశ్మిల రాయపురం గ్రామానికి చెందిన ధనరాజ్‌ను, బాలసుధాకర్ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వాల్మీకి బోయ తెగకు చెందిన అమ్మాయిని కొన్నేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే బాలసుధాకర్, సుశ్మిలలు కేతేపల్లిలో చిన్ననాటి నుంచి కలిసిమెలిసి పెరిగిన వారుకావడం, వారి కుటుంబాల మధ్య చుట్టరికం ఉన్న నేపథ్యంలో వారిరువురు కలిసిమెలిసి ఉండే వారు. దీంతో వారి మధ్య వివాహేతర సంబంధం ఉందంటూ బాలసుధాకర్ భార్య, అటు సుశ్మిల భర్త కొన్నాళ్లుగా ఘర్షణ పడుతున్నారు. ఈ క్రమంలో ఇరువురూ కలిసి ఈ నెల 27న బీబీనగర్ మండలంలోని కొండమడుగు రిసార్ట్‌లో అద్దెకు తీసుకున్న గదికి వెళ్లి ఒకరికొకరు తమ గోడు వెళ్లబోసుకుని తమకు చావుతప్ప గత్యంతరం లేదని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత తమ మరణానికి గల కారణాలు వివరిస్తూ లేఖలు రాసి, సెల్ఫీ వీడియోలు తీసి బంధువులకు పంపి బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ విషయమై ఫిర్యాదు అందుకున్న ఉప్పల్ పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వారు ఉన్న లోకేషన్‌ను పసిగట్టి అక్కడకు చేరుకున్నా అప్పటికే ఇరువురు రిసార్ట్‌లో మృతి చెందారు. మృతదేహాలను భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు ఇరువురి మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించడంతో సోమవారం సాయంత్రం స్వగ్రామాలకు చేర్చారు. క్రైస్తవ మతాచారం మేరకు స్థానికంగా మత గురువుల ప్రార్థనల అనంతరం ఆయా గ్రామాల్లో కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య సోమవారం రాత్రి పొద్దుపోయాక అంతిమ సంస్కారాలను నిర్వహించారు. ఇదిలా ఉంటే ఆత్మహత్యకు పాల్పడిన వారి స్వగ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. సుఖంగా ఉంటారని భావిస్తే అర్ధాంతరంగా అసువులు తీసుకున్నారని బాలసుధాకర్ తల్లి హృదయ మేరి, సుశ్మిల తల్లి ఆంథోనమ్మలు కన్నీరు మున్నీరుగా విలపించారు.

పెట్రోలు పంప్‌సెట్ తరలింపునకు యత్నం



మోత్కూరు పోలీస్‌స్టేషన్‌కు చేరిన పెట్రోలు పంప్

మోత్కూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు సింగిల్ ఆధ్వర్యంలో మండలంలోని దత్తప్పగూడెంలో ఏర్పాటుచేసిన పెట్రోలు పంపుసెట్ తరలింపు వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ఆరేడు మాసాలుగా నడపకుండా నిలిపివేయడంతో ఐవోసీ యాజమాన్యం పంపుసెట్‌ను సోమవారం రాత్రి తరలించేందుకు వాహనంలోకి ఎక్కించారు. వెంటనే సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, సంఘం సీఈవో వరలక్ష్మీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే సింగిల్‌విండో ఆధ్వర్యంలో 2022లో దత్తప్పగూడెంలో కన్స్యూమర్ పెట్రోల్ బంక్(వినియోగదారుల సేవా కేంద్రం) ఏర్పాటుచేశారు. ఇందులో సంఘం సభ్యులకు బయటి కంటే (సర్వీస్ పంపులకన్నా) సుమారు ఒక రూపాయి తక్కువ ధరకు డీజిల్, పెట్రోల్ లభించేది. సుమారు ఏడాదిన్నర నడిచిన తర్వాత కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలతో సర్వీస్ పంపుల కన్నా కన్స్యూమర్ పంపులకు డీజిల్, పెట్రోలు ఎక్కువ ధరకు సరఫరా చేశారు. అధిక ధరకు విక్రయించలేక 2023 డిసెంబరులో బంక్ మూతపడింది. సింగిల్ విండో యాజమాన్యం దాన్ని సర్వీస్ పంపుగా మార్చడానికి ప్రయత్నించింది. కొంత మేర పని పూర్తయ్యింది. పాత పంపులు తొలగించి కొత్త పంపులు బిగించారు. ఇంతలో సంఘం చైర్మన్ మారిపోయారు. సర్వీస్ పంపునకు సంబంధించిన అనుమతులు పొందడంలో జాప్యం జరిగింది. పంపులు బిగించి ఆరేడు మాసాలు గడిచినా అవసరమైన అనుమతులు లభించకపోవడంతో ఐవోసీ యాజమాన్యం అనుమతితో పంపులు బిగించే కాంట్రాక్టర్ సంఘానికి సమాచారం ఇవ్వకుండానే వృథాగా ఉన్న పంపులను సోమవారం రాత్రి దత్తప్పగూడెం నుంచి తరలించే ప్రయత్నం చేశారు. ఒక పంపును ఊడదీసి వాహనంలోకి ఎక్కించారు. ఇంతలో స్థానికులు గమనించి సంఘం సీఈవోకు, చైర్మన్‌కు సమాచారమిచ్చారు. వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేయడంతో పోలీసులు వెళ్లి వాహనంలోకి ఎక్కించిన పంపును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వెంటనే కంపెనీ కాంట్రాక్టర్ వృథాగా ఉన్న పంపులను తీసుకెళ్లడానికి కంపెనీ నుంచి పొందిన అనుమతులను పోలీసులకు చూపించారు. సంఘం సీఈవో, చైర్మన్‌తో కూడా మాట్లాడి మీరు మళ్లీ నడిపే పక్షంలో తిరిగి పంపులు తెచ్చి బిగిస్తామని చెప్పారు. వారి మధ్య చర్చలు సాగుతున్నాయి.

రూ.598కోట్ల వ్యాపారం

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


నల్లగొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సంవత్సరం రూ.598.16కోట్లకు పైగా బ్యాంకు వ్యాపారం జరిగిందని, దీంతో డీసీసీబీ రూ.2940.29కోట్లకు చేరుకుందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా పాలకవర్గ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గం ఏర్పాటు చేసిన వెంటనే ఈ సంవత్సర కాలంలో క్రాప్‌లోన్ గరిష్ఠ పరిమితిని లక్ష రూపాయల నుంచి రూ.1.50లక్షలకు పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా రుణాల విషయంలో పాత పాస్ పుస్తకాలు అవసరం లేకుండా నిర్ణయం తీసుకున్నామన్నారు. పాలక వర్గం క్రాప్‌లోన్ బడ్జెట్ రూ.100కోట్లకు పైగా తీసుకొచ్చినట్లు తెలిపారు. నూతన పథకాల్లో భాగంగా ఎన్‌ఎల్‌ఎం, గ్రామీణ ప్రాంతాలల్లో గృహ రుణాలు, సొసైటీలకు గోదాంల నిర్మాణం కోసం వరల్డ్ లార్జెస్ట్ గ్రైండ్ స్టోరేజీ ప్రాజెక్టు తెచ్చినట్లు తెలిపారు. బ్యాంకు అభివృద్ధికి సహకరించిన పాలకవర్గ సభ్యులను, బ్యాంకు అధికారులు, ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, కొండ సైదయ్య, విరిగినేని అంజయ్య, గుడిపాటి సైదయ్య, దనావత్ జయరాం, బంటు శ్రీనివాస్, కోడి సుష్మ, కొమ్ము కరుణ, కె.వీరస్వామి, బ్యాంకు సీఈవో శంకర్‌రావు, జీఎం నర్మద పాల్గొన్నారు.

చింతపండు దొంగతనంలో..

ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

యాదగిరిగుట్ట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట దేవస్థానంలో జరిగిన చింతపండు దొంగతనంలో ముగ్గురు ఉద్యోగులు (సహాయ పాచికలు) టీ.వాసు, ఎస్.బీ.సంతోష్, ఎస్.కృష్ణమాచార్యులు, ప్రసాదాల తయారీ విభాగం స్టోర్ గుమాస్తా (సీనియర్ అసిస్టెంట్) పి. నవీన్‌ను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేసినట్లు దేవాదాయ కమిషనర్, ఈవో ఎస్.వెంకట్రావు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో సరుకుల స్టాక్ రిజిస్టరును పరిశీలించక, విధుల పట్ల నిర్లక్ష్యం, ఉదాసీనత, అజమాయిషీ లోపంతో అవతవకలు జరిగేందుకు పరోక్షంగా అవకాశం కల్పించినందుకు గాను ఇద్దరు పర్యవేక్షకులు ఏ.సత్యనారాయణశర్మ, పి.వెంకటేశానికి చార్జీమెమోను ఈవో జారీ చేసినట్లు ప్రకటించారు. గత నెల 28న రాత్రి 2.25 గంటలకు ప్రసాదాల తయారీ కేంద్రంలో (కిలో బస్తా 30 కిలోలు) 10 సంచుల చింతపండు దొంగతనం జరిగింది. ఇదే ఘటనలో దొరికిన అవుట్‌సోర్సింగ్ సిబ్బంది మధు, గణేష్‌లపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ అధికారులతో నియమించిన విచారణ కమిటీతో పాదర్శకత లోపించే అవకాశం ఉందని సూచనల మేరకు దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ నేతృత్వంలో నియమించిన హైలెవల్ కమిటీ రెండు (ఈ నెల 16, 17తేదీల్లో) రోజుల్లో విచారణ చేపట్టింది. రెండో రోజు విచారణ సమయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని ప్రశ్నించి సీసీ పుటేజీల ఆధారంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది గడ్డమీది దీలిప్ విచారించారు. అప్పటి నుంచి కమిటీ అందజేసే నివేదిక కోసం ఎదురుచూస్తుండగా దేవస్థాన ఉద్యోగుల్లో సోమవారం ఉత్కంఠ తెరపడింది.

ఇప్పుడంటే ఇంటికో బైక్, ఊరునిండా కార్లు, అంబులెన్స్‌లు, ఆటోలు, బస్సులు ప్రభుత్వ వైద్యశాలలు, ప్రైవేట్ క్లినిక్‌లు ఉన్నాయి. ఏ మాత్రం ఒంట్లో నలతగా ఉన్నా అరగంటలో ఏదో ఓ ఆస్పత్రికి వెళ్ల చికిత్స పొందుతున్నారు. 70, 80 దశకంలో రవా ణా సౌకర్యాల మాటేమోగాని, రోడ్లేలేని ఊర్లే అధికంగా ఉండేవి. విషజ్వరాలబారిన పడినవారికి కూ డా ఆయుర్వేద చిట్కాలే దిక్కు. చివరికి కాన్పులు కూడా మంత్రసానులే చేసేవారు. ఆ సమయంలో ఇంగ్లీష్ వైద్యాన్ని పల్లెలకు చేరువ చేసి ప్రాణాలు కాపాడారు డాక్టర్లు. రాత్రి, పగలనక ప్రజలకు మెరుగైన వైద్యం సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన వారెందరో. చేతిలో చిల్లిగవ్వ లేకుండా క్లినిక్‌కు వచ్చేవారికి ఒక్కోసారి ఉచితంగా వైద్య సాయం అందించే ఉదార స్వభావమే వారికి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. నేడు ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ల పై ప్రత్యేక కథనం



ఈ డాక్టర్లు.. ఆరోగ్య రక్షకులు

▸▸ పల్లెల్లో సేవలందించి గుర్తింపు పొందిన వైద్యులు

▸▸ తక్కువ ఫీజుతో పేదలకు వైద్య సేవలు



పేదల వైద్యుడు రంగారెడ్డి

భానుపురి: గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో పేదల కన్నీళ్లు, కష్టాలు చూసి చలించిన కొప్పుల రంగారెడ్డి వైద్య విద్యను అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. వైద్య పట్టా పొందాక 44ఏళ్లగా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఆదిత్య క్లినిక్ పేరుతో అతి తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందిస్తున్నారు. 44ఏళ్లగా ఎంతో నమ్మకంతో వైద్య సేవలు అందిస్తూ పేదల గుండెల్లో నిలిచిపోయారు. రూ.3 ఫీజు తీసుకుంటు మొదలు పెట్టిన వైద్యం ఏళ్ల గడిచినా రూ.20లు తీసుకోవడం ఆయన ఉన్నతికి నిదర్శనం. కరోనా కష్టాకాలం, సీజనల్ వ్యాధులు వచ్చేటప్పుడు డాక్టర్ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు. వ్యాధుల సీజన్‌లో 100 నుంచి 150 మందికి పైగా రోగులకు వైద్యం అందిస్తున్నారు. యువ వైద్యులను ప్రోత్సహించాలని అంటున్నారు డాక్టర్ రంగారెడ్డి. పేదవాళ్లకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని పేర్కొంటున్నారు. చిన్నతనం నుంచి పేదలకు సేవ చేయడం అలవాటుగా మార్చుకున్నానని, రోగులను ఆత్మీయంగా పలకరిస్తే కొంత మేర రోగం తగ్గుతుందన్నారు.

మాధవరెడ్డి దవాఖానా అంటే ల్యాండ్ మార్క్



చౌటుప్పల్ టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని డాక్టర్ రావుల మాధవరెడ్డి దవఖాన అంటే ఒక లాండ్ మార్క్. ఆయన ఎంతో మంది వైద్యులకు స్ఫూర్తి. మాధవరెడ్డి, వసంత దంపతులతో పాటు కుమారుడు ప్రశాంత్‌రెడ్డి(యూఎస్) వైద్యరంగంలో ఉన్నారు. 1976లో పట్టణంలో మొదటి ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ను ఏర్పాటు చేశారు. మాధవరెడ్డితో పాటు ఆయన సతీమణి వసంత కూడా డాక్టర్ కావడంతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరిగింది. విశ్రాంత జీవితంలో సైతం వారానికి ఒకరోజు స్థానిక రాజీవ్ భవన్‌లో ఉచిత వైద్య సేవలు అందించారు. రాజీవ్ స్మారక ట్రస్ట్ చైర్మన్‌గా మాధవరెడ్డి పేద కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేసే కార్యక్రమం నేటికీ కొనసాగుతోంది.

● భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామానికి చెందిన రావుల ఎల్లారెడ్డి- రంగమ్మ దంపతుల చిన్న కుమారుడు మాధవరెడ్డి 1949 ఆగస్టు 15న జన్మించారు. హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీ(ఓయూ)లో 1974లో మెడిసన్ పూర్తిచేశారు. 1977లో వరంగల్‌కు చెందిన డాక్టర్ వసంతతో వివాహం జరిగింది. నర్సింగ్ హోమ్‌కు రెండో కుమారుడు ప్రశాంత్‌రెడ్డి పేరు పెట్టుకున్నారు. ప్రశాంత్‌రెడ్డి ప్రస్తుతం అమెరికాలో వైద్యుడిగా సేవలందిస్తున్నారు. మూడు దశాబ్దాలకు పైగా వైద్యసేవలను అందించిన మాధవరెడ్డి, వసంత దంపతులు 2007నుంచి హైదరాబాద్‌లో విశ్రాంత జీవితం గడుపుతున్నారు. డాక్టర్ వసంత హైదరాబాద్‌లో కొంతకాలం వైద్య సేవలు అందించారు. ముగ్గురు అబ్బాయిల్లో ఒకరు వైద్యుడు కాగా, ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు. ముగ్గురూ అమెరికాలో స్థిరపడ్డారు.

వైద్యం వ్యాపారంగా మారింది

వైద్య సేవలు నేడు వ్యాపారంగా మారాయి. పరీక్షల పేరుతో రోగుల నుంచి డబ్బులు గుంజుతున్నారు. వైరల్ ఫీవర్స్ కూడ పరీక్షలు చేయించి రోగులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అవసరం లేకున్నా పరీక్షలు చేయించడం దారుణం. మందులు వాడకున్న కొన్ని జబ్బులు 4, 5రోజుల్లో తగ్గిపోతాయి. రోగికి వచ్చిన అనారోగ్య సమస్యను ఓపికగా విని, అవసరమైన మేరకే మందులు రాయాలి. ● డాక్టర్ రావుల మాధవరెడ్డి

నిరుపేదలకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో వైద్య వృత్తిని ఎంచుకున్నా



మర్రిగూడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలకు వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో డాక్టర్ వృతి ఎంచుకున్నాను. మాది మధ్య తరగతి కుటుంబం. తండ్రి ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగి. అమ్మ గృహిణి. పట్టుదలతో ఎంబీబీఎస్ కోర్సును పూర్తి చేశా. వివాహనంతరం నా భర్త ప్రోత్సాహంతో పీటీ డెర్మటాలజిస్ట్ కూడా పూర్తి చేశాను. వైద్యరీత్యా నేను నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఆనందం సంతృప్తి నిచ్చింది. ప్రస్తుతం మర్రిగూడ మండలంలో సీహెచ్‌సీ కమ్యూనిటీ ఆరోగ్య సెంటర్‌లో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. ● డాక్టర్ అరుణ తార

వైద్యరంగంలో గణనీయమైన అభివృద్ధి



వైద్యరంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందింది. దేశంలో వైద్యుల కృషి ఫలితంగానే స్మాల్ ఫాక్స్, పోలియో, డయేరియా వంటి వ్యాధులను నిర్మూలించగలిగారు. సూర్యాపేట ఎంఆర్‌ఐ పరీక్షలు చేసే స్థాయికి ఎదిగింది. జూలై 1న తేదీన డాక్టర్ బీసీ రాయ్(డాక్టర్స్ డే) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలి. ప్రజలకు నిరంతరం సేవలు అందించడానికి ఐఎంఏ పని చేస్తుంది. ● డాక్టర్ పూర రాంమూర్తియాదవ్, సూర్యాపేట ఐఎంఏ ట్రస్టు చైర్మన్

మర్కట విహారం




నల్లగొండ జిల్లాకేంద్రంలోని వెంకటేశ్వరకాలనీ, ఆర్జాలబావి, హనుమాన్‌నగర్, రవీంద్రనగర్ కాలనీల్లో వానరాలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఇళ్లలోకి వెళ్లి వస్తువులను చిందవందరం చేస్తున్నాయి. మనుషులపై దాడులు కూడా చేస్తున్నాయి. మునిసిపల్ అధికారులు స్పందించి కోతులను పట్టుకొని అటవీ ప్రాంతానికి తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ







రైల్వే చార్జీలు స్వల్పంగా పెరుగుదల

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నట్లు తెలుస్తోంది. సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులపై భారం ఆర్థిక భారం పడకుంగా ఏసీ, త్రీ టైర్, ఫస్ట్‌క్లాస్‌ల టికెట్ ధరలను సవరించడంతో పాటు స్వల్పంగా పెంచేదిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ఇటీవల తెలిపారు.

ఓటీపీ వస్తేనే సుమా..!

టికెట్ ధరలను నామమాత్రంగా పెంచిన భారతీయ రైల్వే తాత్కాల్ టికెట్ బుకింగ్‌లోనూ చేసిన కీలక మార్పులు జూలై 1నుంచి అమల్లోకి వచ్చాయి. టికెట్ బుకింగ్‌కు గుర్తింపు కార్డును ఇప్పటికే తప్పనిసరి చేసిన ఇండియన్ రైల్వే తాత్కాల్ టికెట్ బుకింగ్‌కై ఆధార్‌తో అనుసంధానం చేసిన మొబైల్‌కు ఓటీపీ పంపిస్తుంది. ఓటీపీ ఎంటర్ చేస్తేనే టికెట్ బుక్ అయ్యేట్లుగా మార్పులు చేయడం గమనార్హం.

జిల్లా మీదుగా పలు రైళ్లు

జిల్లా మీదుగా 50కి పైగా రైళ్లు వెళ్తన్నాయి. ఇటు గుంటూరు, తిరుపతి, చెన్నై, కేరళ, విజయవాడ, వైజాగ్, కలకత్తా నగరాలకు, అటు నల్లగొండ, హైదరాబాద్, సికింద్రాబాద్, షిర్డీ, ముంబై వైపునకు రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి. ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండగా జిల్లాలోని రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్లుగా కేంద్రప్రభుత్వం ఆధునీకరిస్తోంది. మరోవైపు పగిడిపల్లి-నల్లపాడు వరకు డబ్లింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ప్రయాణికులకు నాణ్యమైన సేవలు



ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. సాఫ్ట్‌వేర్ అప్డేట్స్‌పై స్టేషన్లకు సమాచారం అందింది. టికెట్ ధరల పెంపు నామమాత్రంగానే ఉంది. సాధారణ, సెకండ్ క్లాస్ టికెట్ల ధరల్లో ఎటువంటి మార్పు లేదు. ఏసీ, త్రీటైర్, ఫస్ట్‌క్లాస్ తరగతుల్లో కిలోమీటర్‌కు అరపైస నుంచి రెండు పైసలు మాత్రమే పెంచుతూ రైల్వేశాఖ సర్క్యులర్ జారీ చేసింది.

-సతీష్ నావిళ్ల, చీఫ్ కమర్షియల్ ఇన్స్‌పెక్టర్, నల్లగొండ

ప్రయాణం సుఖమయంగా మారింది



గతంతో పోలిస్తే రైల్వే ప్రయాణంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రయాణం సఖమయంగా, వేగవంతంగా మారింది. టికెట్ బుకింగ్ విధానాన్ని అప్డేట్ చేసింది. లక్షమంది ప్రయాణికులు ఒకేసారి బుక్ చేసుకునేలా సర్వర్లను, సాంకేతికతను అభివృద్ధి చేయడం గొప్ప విషయం. ఇక స్వల్పంగా పెరిగిన ధరలు పేద, మధ్యతరగతి వర్గ ప్రయాణికులపై ఎంతమాత్రం ప్రభావం చూపవు.

-తల్లం అశోక్ , రైస్ మిల్లర్, ఇండస్ట్రియల్ సెల్ జిల్లా కన్వీనర్, మిర్యాలగూడ

రిజర్వాయర్ పూర్తికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

చౌటుప్పల్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శివన్నగూడెం రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో సోమవారం సీపీఎం మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జహంగీర్ మాట్లాడుతూ, రిజర్వాయర్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఈ రిజర్వాయర్ ద్వారా చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాలకు కృష్ణా జలాలను అందించాలని ఆయన అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో జరుగుతున్న 100 పడకల ఆసుపత్రిని త్వరిత గతిన పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బూరుగు కృష్ణా రెడ్డి, మండల కార్యదర్శి గంగదేవి సైదులు, నాయకులు రాగీరు కిష్టయ్య, గడ్డం వెంకటేశం, బొజ్జ బాలయ్య, బోయ యాదయ్య, తడక మోహన్, చింతల సుదర్శన్, అంతటి అశోక్, జక్కిడి రామ్ రెడ్డి, కొండె శ్రీశైలం, సీహెచ్.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కాల్వలు పూర్తి చేయాలి

గుండాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దేవాదుల ప్రాజెక్టు ద్వారా మండలంలో ఉన్న పెండింగ్ కాల్వలను పూర్తి చేసి మండలానికి సాగు నీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో మాట్లాడారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బిక్కేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను అరికట్టాలన్నారు. మండలంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో మండల కార్యదర్శి అనంతుల రామ చంద్రయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సత్యనారాయణ, రాష్ట్ర సమితి సభ్యులు ఆది సాయిలు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లూరు రాజయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యవర్గ సభ్యులు చంద్రయ్య, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు చెక్క వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోదా శ్రీరాములు

భువనగిరిలో భారీ వర్షం

భువనగిరి టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరిలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా సాయంత్రం అకస్మాత్తుగా వర్షం కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణంలోని పలు ప్రాంతాలు గంటల తరబడి చీకటిలోనే మగ్గాయి. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురికి కాల్వలు పొంగి ప్రవహించాయి. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	511.60 అడుగులు
టీఎంసీలు	134.4032
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	900 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	900 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	24.96 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	640.30 అడుగులు
టీఎంసీలు	3.55
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	6. 82 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	90.77క్యూసెక్కులు

మేలు రకం విత్తనంతోనే మెరుగైన పంట

● పంటల సాగులో విత్తన ఎంపికే ప్రధానం

● వానాకాలం సాగుకు రైతన్నల సమాయత్తం



నారుమడిని సిద్ధం చేస్తున్న రైతు

నిడమనూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమైంది. దీంతో సాగుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో యాసంగి సీజన్‌లో 5.50 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు చేయగా, వానాకాలం సీజన్‌లో అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ఈనేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' కథనం.. ఆయకట్టు రైతులు సాగర్ కాల్వల నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. బోర్లు, బావులు తదితర నీటి సదుపాయం ఉన్న రైతులు నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు. పంటల సాగులో మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవడమే ఎంతో ప్రధానమని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రతీ సీజన్‌లో విత్తన ఎంపిక రైతుకు క్లిష్టంగా మారుతోంది. ఏ పంటలోనైనా అధిక దిగుబడులు సాధించాలంటే నాణ్యత కలిగిన మేలు రకం విత్తనాలు వాడాలి. కానీ తరచూ నకిలీ విత్తనాలతో ఎంతో మంది రైతులు నష్టపోతూనే ఉన్నారు. రైతుల అమాయకత్వం, విత్తనాలపై సరైన అవగాహన లేకపోవడంతో దళారులు రైతాంగాన్ని సులువుగా మోసం చేస్తున్నారు. సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో వారిని నిలువునా ముంచేందుకు మార్కెట్‌లో నకిలీ విత్తనాలు వచ్చి పడుతుంటాయి. రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరిస్తున్నప్పటికీ వారు బోగస్ విత్తన కంపెనీల వలలో చిక్కుకుంటున్నారు. పలు ప్రైవేటు విత్తన కంపెనీలు ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో, నకిలీ లేబుళ్లతో రైతులను సునాయాసంగా మోసం చేస్తున్నాయి. అటువంటి విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. విత్తనాలు కొనుగోలు చేసే ముందు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయాధికారులకు గాని, పోలీసులకు గాని సమాచారం అందించాలి. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాతే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలి.

సంచులపై వివరాలు: విత్తన సంచులపై ఉన్న వివరాలను పూర్తిగా చదువుకున్న తర్వాతే వాటిని కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. సంచులపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన సమాచారం ముద్రించి ఉందో లేదో చూసుకోవాలి. సంచులపై ధృవీకరణ సంస్థ పేరు, చిరునామా కలిగిఉండాలి. అలాగే విత్తన రకం, దాని జన్యు స్వచ్ఛతకు సంబంధించిన సమాచారం, లాట్ క్రమ సంఖ్య తదితర విషయాలు సమగ్రంగా పొందుపరిచి ఉండాలి. విత్తన ఉత్పత్తిదారుని పేరు, చిరునామాతో పాటు విత్తనాలను ఎప్పటివరకు వినియోగించుకోవచ్చో తెలిపే సమాచారం ఉండాలి. ట్యాగ్ ఇచ్చిన తేదీ వివరాలు సరిగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని రైతులు జాగ్రత్తగా పరిశీలించాలి.

తోటి రైతుల అనుభవాలు తెలుసుకోవాలి: కొత్తగా విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఆ విత్తనాలను ఇంతకుముందు తోటి రైతులు ఎవరైనా కొనుగోలు చేసి ఉపయోగించారా, వాటికి చీడపీడల్ని తట్టుకునే సామర్థ్యం ఎంతవరకు ఉందనే విషయాలు తెలుసుకోవాలి.

విత్తనోత్పత్తి: మేలు రకం విత్తనాలను రైతులు కూడా ఉత్పత్తి చేసుకోవచ్చు. మంచి విత్తనం అంటే శుభ్రత, నాణ్యతతో పాటు బాగా మొలకెత్తే స్వభావం ఉండాలి. ప్రతీ రైతు తనకు తానే నాణ్యమైన విత్తనాలను తయారు చేసుకుంటే త క్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించి మంచి ఆదాయం పొందవచ్చు. దీంతో నకిలీ విత్తనాలకు కూడా కళ్లెం వేయవచ్చు. పరిశోధనా స్థా నాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో రూపొందించబడే బ్రీడర్ విత్తనం నుండి ఫౌండేషన్ విత్తనాన్ని ఉత్పత్తి చేస్తారు. ఈ ఫౌండేషన్ విత్తనాల నుంచి సర్టిఫైడ్ (ధృవీకరించబడిన) విత్తనాలు ఉత్పత్తి అవుతాయి. రైతులు ఈ విత్తనాలనే వాడాల్సి ఉంటుంది. సర్టిఫైడ్ సీడ్స్ జన్యుపరంగా మంచి లక్షణాలు కలిగిఉంటాయి. మొలక శాతం ఎక్కువగా ఉంటుంది. రోగకారకమైన శిలీంద్రా ల బెడద ఉండదు. అలాంటి విత్తనాలతో పండించిన పంటల నుంచి వి త్తనోత్పత్తి చేసుకొని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

టీఎస్ సీడ్స్ ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ: వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన మేలురకం వరి, అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందించేందుకు సంస్థ ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి జిల్లాలోని 104 పంపిణీ కేంద్రాల్లో విత్తనాలను రైతులకు విక్రయించనుంది. ఆయా కేంద్రాల్లో వివిధ రకాల విత్తనాలు అందుబాటులో ఉంచింది. జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలకు 50 శాతం సబ్సిడీ ఉంది.


రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆథరైజ్డ్ డీలర్ల వద్దే కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదులు పొందాలి. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎవరైనా కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు అనుమానం వస్తే సమాచారం అందించాలి. రైతులు తమ సలహాలు, సూచనలు తీసుకొని నాణ్యమైన విత్తనాలతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలి.

-దండెం విజయచంద్ర, ఏఈవో

నిత్యపూజా కైంకర్యాలు



ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు

సుప్రభాతసేవ : ఉదయం 3.30-4 గంటల వరకు

ఆరాధన : 4-4.30వరకు, **బాలభోగం:**4.30-5.15వరకు

నిజాభిషేకం: 5.15-6.15, **పుష్పాలంకరణ సేవ:** 5.30-6.00

సహస్రనామార్చనలు: 6.15 నుంచి 7 గంటల వరకు

రాజభోగం: 11.45-12.30, మధ్యాహ్నం 3-4 గంటలవరకు ఆలయం మూసివేత

తిరువారాధన:సాయంత్రం 7-7.45, **సహస్రనామార్చన:**రాత్రి 7.30-8.15

ఆరగింపు: 9-9.45, **శయనోత్సవ దర్శనం:** 9.30- 9.45ద్వార బంధనం

ఉచిత దర్శనం:ఉదయం 6-7.30, 10-11.45 సాయంత్రం 5-7,రాత్రి 8.15-9

వీఐపీ దర్శనాల వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి : ప్రిన్సిపాల్ సుధారాణి

కనగల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కనగల్ పోలీస్ క్వార్టర్స్‌లో ఈ విద్యాసంవత్సరం నుంచి నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోని ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

మునుగోడురూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తకు నాయకులు ఆర్థికసాయం చేశారు. ఎలుగలగూడెం గ్రామానికి చెందిన ఈదులకంటి అశోక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి రూ.10వేలు పంపగా, బీఆర్ఎస్ గ్రామ నాయకులు రూ.10వేలు సేకరించి సోమవారం అశోక్ తల్లిదండ్రులకు రూ.20వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మేకల శ్రీనివాస్‌రెడ్డి, రవి, లింగస్వామి, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

జ్ఞాపిక అందజేత

● మునుగోడు రూరల్: డీసీసీబీ చైర్మన్‌గా ఏడాది పూర్తి చేసిన సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని గ్రామానికి చెందిన వెదిర ఫౌండేషన్ చైర్మన్ వెదిర మేఘా రెడ్డి సోమవారం ఆయన్ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

ఆపదలో ఆదుకునేవారేరీ...

● 'ప్రజావాణి'లో బాధితుల ఆవేదన

నల్లగొండటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అధికారులు, కార్యాలయాల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్నా తమను పట్టించుకునే వారే కరువయ్యారంటూ జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అనేక మంది బాధితులు ప్రజావాణిలో మొరపెట్టుకున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన బాధితులు అదనపు కలెక్టర్ ఎదుట తమ సమస్యల పరిష్కారం కోసం స్థానికంగా ఉండే అధికారులను కలిసి తమ సమస్యలను విన్నవించినా ఫలితం లేకుండాపోతుందని ఆరోపించారు. ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా తమకు పరిష్కారం లభించడం లేదని వాపోయారు. వారంవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం జిల్లా నలుమూలల నుంచి అనేక మంది బాధితులు ఎన్నో వ్యయప్రయాలకోర్చి అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారిలో కొందరు భూ సంబంధిత సమస్యలపై తరలిరాగా మరికొందరు ఇతర అంశాలపై వచ్చారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, హౌజింగ్‌పీడీ రాజ్‌కుమార్, డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డిలతో కలిసి బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో కొన్నింటిని అక్కడికి అక్కడే పరిష్కరించగా మరికొన్నింటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాకు మా గ్రామంలో సర్వే నెంబర్ 720లో గల సుమారు 6 ఎకరాల అసైన్డ్ భూమి మా తాతల ముత్తాతల నుంచి వంశపార్యంగా సంక్రమిస్తూ వస్తుంది. ఆ భూమిని సేద్యం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. ఈ భూమికి సంబంధించి 1986, 1987, 1992, 2001 మా కుటుంబీకులకు పట్టా సర్టిఫికెట్లు కూడా వచ్చాయి. అదేవిధంగా గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి తమ పూర్వీకులు సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూమిని కూడా తామే సేద్యం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. పట్టా ఉన్న భూమి, కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన డిజిటల్ పట్టా మార్పిడి ఇంత వరకు తమకు జరగలేదు. అయితే స్థానిక రెవెన్యూ అధికారులు తాము కబ్జాలో ఉండి సేద్యం చేసుకుంటున్న భూమిలో మాకు సమాచారం ఇవ్వకుండానే సర్వే నిర్వహించి దౌర్జన్యంగా హద్దు రాళ్లను నిర్ణయించారు. ఇదే విషయమై తాము అన్ని ఆధారాలతో రెవెన్యూ అధికారిని సంప్రదించగా తమ పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా తమపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు.

\- ముప్పారం గ్రామస్థులు, నిడమనూరు మండలం

పట్టా ఇప్పించండి



నాకు మా గ్రామ శివారులోని సర్వే నెంబర్ 827 లో గల 3 ఎకరాల భూమి 1978 నుంచి మా తాతల కాలం నుంచి మాకు వస్తుంది. ఆ భూమిని సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. అయితే భూమిలో ఇప్పటికి తాము కబ్జాలో ఉన్నా తమకు ఇంత వరకు పట్టా మాత్రం కాలేదు. అనేక మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేదు. ఇటీవల నిర్వహించిన రైతు సదస్సుల్లో కూడా పట్టాదారు పాసుపుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. దయచేసి విచారణ జరిపించి తమకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించండి.

\- కిన్నెర రవి, తిప్పర్తి

బిల్లులు ఇప్పించి ఆదుకోవాలి



బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు కొంతకాలంగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకంలో జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ప్రభుత్వం సకాలంలో విద్యార్థులకు సంబంధించిన బిల్లులను ఆయా పాఠశాలలకు విడుదల చేయకపోవడంతో ఆయా యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులు, తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తున్నారు. దయచేసి నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి.

\- బీఏఎస్ బాధితుల తల్లిదండ్రులు, నల్లగొండ

దివ్యాంగుల పింఛన్ ఇప్పించండి



నేను నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యాంగుడిని. నాకు రెండ్లు కళ్లు కనిపించవు. నాకు ఎలాంటి ఆస్తులు లేవు. నా ఇద్దరి పిల్లల పోషణ, చదువులు భారంగా మారింది. రెండేళ్లుగా ఆస్పత్రుల చూట్టూ తిరుగుతున్నా నాకు మాత్రం కంటి చూపు రావడం లేదు. అయితే అంధుడినైన తనకు పింఛన్ మంజూరు చేయాలని కొంతకాలంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండాపోయింది. గతంలో సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా 100 శాతం వైకల్యం కలిగి ఉన్నట్లు తాత్కాలికంగా సర్టిఫికెట్ జారీ చేశారు. దాని ఆధారంగా దరఖాస్తు చేసుకున్నా పింఛన్ మంజూరు కాలేదు. ఇదే క్రమంలో ఆ సర్టిఫికెట్ కాలపరిమితి కూడా ముగియడంతో తిరిగి మరోసారి దరఖాస్తు చేసుకోగా ఈ సారి 70శాతం అంగవైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. దాని ప్రకారం మరోసారి పింఛన్ దరఖాస్తు చేసుకున్నా పింఛన్ ఇవ్వలేదు. అన్ని రకాల అర్హతలు కలిగిన తనకు దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని కోరారు.

\- మల్లికంటి సత్యం, అశోక్‌నగర్, మిర్యాలగూడ

తిరుమలనాథస్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

● ప్రభుత్వ సలహాదారు గోవిందహరి, ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలరూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పెద్దకాపర్తిలోని భూసమేత శ్రీ తిరుమలనాథస్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు (దేవాదాయశాఖ), ఆర్కిటెక్చర్ గోవిందహరి, నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం తెలిపారు. మండలంలోని పెద్దకాపర్తి శివారులో గుట్టపై గల తిరుమలనాథస్వామి ఆలయాన్ని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సోమవారం సందర్శించారు. స్వామివారిని దర్శించుకోగా పురోహితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఆలయాన్ని, పరిసరాలను పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో పచ్చదనం ఏర్పాటు, రోడ్ల నిర్మాణాలు, అభివృద్ధికి కావాల్సిన అనుమతులు, ఆలయం వద్ద చేపట్టే నిర్మాణాలకు అవసరమయ్యే ఖర్చు అంచనా గురించి ఇరువురు చర్చించారు. పూర్తిస్థాయిలో అన్ని నిర్మాణాలకు అవసరమయ్యే అంచనాలను త్వరలో రూపొందించనున్నట్లు సలహాదారు ఎమ్మెల్యేకు తెలిపారు. నిర్మాణాలకు ఇతర అవసరాలకు సంబంధించిన అంచనాలను వివరాలను తనకు అందజేయాలని కార్యనిర్వాహణాధికారి నాగిరెడ్డికి సూచించారు. ఆలయ అభ్యున్నతికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట నాయకులు, భక్తులు తదితరులు ఉన్నారు.



పెద్దకాపర్తిలో ఆలయ అభివృద్ధి గురించి చర్చిస్తున్న ప్రభుత్వ సలహాదారు గోవింద హరి, ఎమ్మెల్యే వీరేశం

అర్హులకే డబుల్ ఇళ్లు

● ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిజమైన అర్హులకే డబుల్‌బెడ్ రూం ఇళ్లు అందజేస్తామని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాని వారికి ఇందిరమ్మ ఇళ్లలో అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాలలో సోమవారం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాల విషయంతో గత బీఆర్ఎస్ నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. పదేళ్ల క్రితం ప్రారంభమైన ఇళ్ల నిర్మాణం పూర్తికాలేదన్నారు. కొద్ది మొత్తాన్ని వెచ్చిస్తే ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేదని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల నిర్మించిన ఇళ్లకు కూడా నష్టం జరిగిందన్నారు. నెల రోజుల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, గుడిపాటి లక్ష్మీనర్సింహ, కాటం వెంకటేశం, ఎద్దులపురి కృష్ణ, ఏర్పుల పరమేశం, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణనాయక్, ఎంపీడీవో జయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

కట్టంగూరు: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. కట్టంగూరులోని అంబేడ్కర్‌నగర్‌లో మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.6.56 లక్షలతో చేపట్టనున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి పాఠశాలల బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఎంఈవో అంబటి అంజయ్య, మాజీ జడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, నాయకులు రెడ్డిపల్లి సాగర్, మిట్టపల్లి శివ, మర్రి రాజు, ఐతగోని నర్సింహ, గంగాధర్‌రావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు.. కినుక

(5వ పేజీ తరువాయి)

విత్తనాలు విత్తకపోతే ఎకరాకు 3 క్వింటాళ్ల నుంచి 5క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తుంది. అది కూడా నాణ్యత లేకుండా వచ్చే అవకాశం ఉంది. దిగుబడి తగ్గితే రైతులు ఆర్థికంగా దెబ్బతింటారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వ్యవసాయరంగంపై నీలినీడలు అలుముకున్నాయి. జూలై మొదటి వారంలోగా వర్షాలు సమృద్ధిగా కురిస్తే మెట్ట రైతులు కొంతలో కొంత పెట్టుబడులతోనైనా బయట పడతారు. లేదంటే లక్షల రూపాయల పెట్టుబడులను రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

జిల్లాలో లోటు వర్షపాతం ఇలా..

మండలం	లోటు వర్షపాతం
నార్కట్‌పల్లి	-58.1మి.మీ
కట్టంగూరు	-42.2మి.మీ
శాలిగౌరారం	-69.0మి.మీ
నల్లగొండ	-61.3మి.మీ
కనగల్	-51.1మి.మీ
అనుముల	-71.3మి.మీ
నిడమనూరు	-67.9మి.మీ
వేములపల్లి	-62.5మి.మీ
మిర్యాలగూడ	-57.0మి.మీ
తిరుమలగిరి(సాగర్)	62.8మి.మీ
పెద్దవూర	-50.మి.మీ
గుర్రంపోడు	-67.1మి.మీ
గుడిపల్లి	-43.6మి.మీ
చండూరు	-47.9మి.మీ
నాంపల్లి	-58.4మి.మీ

భారీగా పెట్టుబడులు పెట్టాం



వ్యవసాయానికి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాం. వర్షాలు జాడ లేకుండాపోయా యి. వర్షాలు రాకపోతే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. వర్షాలు లేక బోర్లు కూడా ఎండిపోయాయి. బోర్లు ఆగి ఆగి పోస్తుండటంతో నారుమళ్లు కూడా తడవడం లేదు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో పంటల దిగుబడులు కూడా తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు వర్షాలు కురిసినా కనీసం మెట్ట పంటలు దక్కించుకొని వరి నాట్లు వేసుకుంటాం.

\- కె.శంకరయ్య, రేగట్టె, కనగల్ మండలం

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



తంగెళ్ల సునంద దంపతులను సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

కట్టంగూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరిగా ఉంటుందని ఎంఈవో అంబటి అంజయ్య అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా విద్యార్థులకు 42 సంవత్సరాలు ఉత్తమ సేవలందించిన కట్టంగూరు హైస్కూల్ టీచర్ (ఎస్ఏ) తంగెళ్ల సునంద సోమవారం ఉద్యోగ విరమణ చేశార. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఉద్యోగ విరమణ సన్మాన, అభినందన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం (ఎంఈవో) అంబటి అంజయ్య, కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి సునంద దంపతులకు పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు మార్గదర్శకులని పేర్కొన్నారు. ఆమె జ్ఞాపకంగా పాఠశాలకు ఆమె కుమారులు ఓం ప్రకాశ్‌రెడ్డి, ఇందు, సూర్యప్రకాశ్‌రెడ్డి, మౌనిక సుమారు రూ.లక్ష విలువ చేసే ఆర్‌వో ప్లాంట్‌ను పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుమ్ముల మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హెచ్ఎం రంగరాజు, జ్యోతి, పున్నం రవీందర్, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు కొంక ఆథోని, చిన్ని శ్రీనివాస్, గఫూర్, మహాలక్ష్మి, నర్సింహారెడ్డి, దామోదర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, కొండల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి


కట్టంగూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎంఈవో అంబటి అంజయ్య అన్నారు. మండలంలోని మునుకుంట్ల గ్రామంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మునుకుంట్ల గ్రామానికి చెందిన సుక్క ఆనంద్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సీఐ సుక్క వెంకన్న దాతృత్వంతో ఉచిత షూస్‌ను అందజేశారు. అదే పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు బొడ్డుపల్లి వెంకటయ్య కుమార్తె మౌనిక, అల్లుడు రవి అందించిన టై, బెల్టులను సోమవారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం షమీమ్‌బేగం, సుక్క రామలింగయ్యలతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

మర్రిగూడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తుందని ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమావత్ శ్రీనివాసనాయక్ అన్నారు. మండలంకేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నిరుపేదల కోసం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి నిరుపేదలకు అండగా నిలుస్తుందని అన్నారు. ఇందిరమ్మ పథకంతో నిరుపేదల కల సాకారమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని అన్నారు. ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయన వెంట నాయకులు బంగారం నర్సింహ, యాదయ్య, పరశురాం, రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉన్నతమైన భవిష్యత్తు

నాంపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నేటి బాలల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలంటే విద్య ఒక్కటే మార్గమని మాజీ ఎంపీటీసీ కడారి సిరిసిల్లయాదవ్ అన్నారు. మండలంలోని తుంగపాడు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 70 మంది విద్యార్థులకు సోమవారం ఆయన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలను అందజేశారు. తమ జీవితాలు ఉన్నతంగా ఉండాలంటే విద్య ఒకటే మార్గమని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి కన్నవారి కళ్లలో వెలుగులు నింపడానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, మాజీ ఉపసర్పంచ్ పచ్చిపాల ఆంజనేయులు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి, దేవాలయ మాజీ చైర్మన్ మేకల దేవేందర్, పులకర వెంకటయ్య, నాయకులు నీల నరసింహ, నేతల యాదగిరి, నరేష్, గిరి, లింగయ్య, కసిరెడ్డి మహేష్, సుధాకర్, నేతల నరేష్, మల్లేష్, మహేందర్, వెంకటరమణ, భిక్షం, దామోదర్, నరేందర్, నేతల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66

ఉష్ణోగ్రత	
గరిష్ఠం	37.5
కనిష్ఠం	24.4

ఈ డాక్టర్లు ఆరోగ్య రక్షకులు 7

వైటీపీఎస్‌లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి 6

బోధనాసుపత్రుల బాగుకు ఏంచేద్దాం?
● ఎంసీఎంసీ తనిఖీల అనంతరం ప్రభుత్వానికి నివేదిక అందజేత



రైల్వే చార్జీలు స్వల్పంగా పెరుగుదల

నేటి నుంచి అమలు

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో రైల్వేది కీలక పాత్ర. మెరుగైన సేవలందించే దిశగా అడుగులు వేస్తున్న ఇండియన్ రైల్వే ప్రయాణికులపై కాస్త భారం మోపనుంది. ఐదేళ్లుగా స్థిరంగా ఉన్న రైలు టికెట్ ధరలను సవరించి, స్వల్పంగా పెంచింది. పెరిగిన టికెట్ ధరలు మంగళవారం నుంచి అమలు లోకి రానున్నాయి. అయితే 2013, 2020లో టికెట్ ధరల సవరణతో పోలిస్తే ప్రస్తుత పెంపు నామమాత్రమేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

సాధారణ, సెకండ్ క్లాస్ రైలు ప్రయాణంలో 500కిలోమీటర్ల లోపు ప్రయాణానికి టికెట్ ధరలను మార్పులు చేయలేదు. అంతకంటే ఎక్కువ దూరం ప్రయాణిస్తే కిలోమీటరుకు అరపైసచొప్పున పెంచుతున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఆర్డినరీ టికెట్ ధరలు కిలోమీటర్‌కు అర పైసా, సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్, ఫస్ట్‌క్లాస్ మెయిల్, ఎక్స్‌ప్రెస్ టికెట్ ధరను కిలోమీటర్‌కు ఒక పైసా, ఏసీ చైర్ కార్, ఏసీ త్రీ టైర్, ఏసీ టూ టైర్, ఏసీ ఫస్ట్‌క్లాస్ టికెట్ ధరలను కిలోమీటర్‌కు రెండు పైసలు ఇండియన్ రైల్వే పెంచింది. సబర్బన్ రైళ్లు, సీజనల్ టికెట్లపై 500 కిలోమీటర్లలోపు ప్రయాణ టికెట్లపై ఎటువంటి పెంపు లేదు. అయితే పెరిగిన ధరలు ప్రయాణికులపై పెద్దగా ప్రభావం చూపవని వినియోగదారుల సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

దశలవారీ పెంపు కోసమేనా?..

ప్రయాణికులపై ప్రభావం పడకుండా దశలవారీగా టికెట్ ధరల పెంపునకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు సమాచారం. రైల్వే సహాయ మంత్రి సోమన్న ఇటీవల చేసిన ప్రకటన ప్రకారం దశలవారీగా రైల్ టికెట్ ధరలను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం...

- మిగతా 7వ పేజీలో...

చినుకు.. కినుక



వర్షాలు లేక ఎదగని పత్తి మొలకలు

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో ముందుగా మురిపించి ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మే నెల ఆఖరి వారంలో ముందస్తు వర్షాలు కురవగా, జూన్ నెల మొత్తం వర్షాల జాడలేదు. ఆకాశంలో మబ్బులు ఊరిస్తున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

» 2.22లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు » జూన్‌లో 30.1మి.మీల వర్షం లోటు » ఈనెల 15 వరకు పత్తి విత్తనాలు విత్తే అవకాశం

వానాకాలం సీజన్‌లో పూర్తిస్థాయిలో విత్తనాలు విత్తడంతో పాటు మొక్కలు ఏపుగా ఎదగాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం పరిస్థితులు అందుకు విరుద్ధంగా విత్తిన విత్తనాలు భూమిలోనే మాడిపోతున్నాయి. కొన్ని చోట్ల పత్తి మొలకలు వచ్చినా ఎదుగు బొదుగు లేకుండా ఉన్నాయి. ఆకాశంలో మేఘాలు దట్టంగా కనిపించడం, చిరు జల్లులు కురిసి చల్లటి వాతావరణం ఏర్పడం మినహా భారీ వర్షాలు లేవు. ఓ మోస్తరు వర్షాలు కురిసినా విత్తనాలు విత్తే వీలుంటుంది. ప్రస్తుతం గాలులు వీయడం మినహా చినుకులు కరువయ్యాయి.

2లక్షలకు పైగా ఎకరాల్లో పత్తి విత్తనాలు

జిల్లా వ్యాప్తంగా జూన్ మాసంలో 2.22లక్షల ఎకరాల్లో రైతులు పత్తివిత్తనాలు విత్తారు. 86ఎకరాల్లో మాత్రమే కంది వేయగా,4వేల ఎకరాల్లో రైతులు వరి నారుమడులు పోశారు. అయితే వర్షాలు లేక పత్తి విత్తనాలు మొలకెత్తకపోగా మొలకెత్తిన పత్తి మొలకలు ఎదగకుండా ఉన్నాయి. దీంతో 2.22లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తిన రైతుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. జూన్ నెలలో 86.8మి.మీల వర్షపాతానికి 60.7మి.మీల వర్షం కురిసింది. ఈ నెలలో 30.1మి.మీల వర్షపాతం లోటుగా ఉంది. జూన్ మాసంలో దేవరకొండ డివిజన్‌లో చింతపల్లి, దేవరకొండ, గుండ్లపల్లి, చందూరు డివిజన్‌లోని మర్రిగూడ మండలంలో మాత్రమే కాస్తా అధికంగా వర్షాలు కురవగా, మిగతా అన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే లోటు వర్షపాతమే అధికంగా ఉంది.

పంటల దిగుబడులపై ప్రభావం

వర్షాలు నెల రోజుల పాటు కనుమరుగు కావడంతో విత్తనాలు ఆలస్యంగా విత్తుతుండటంతో పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపించనుంది. వానాకాలం సీజన్‌లో షెడ్యూల్ ప్రకారం విత్తనాలు విత్తకపోతే పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈనెల 15 వరకు పత్తి విత్తనాలు వేసేందుకు అనుకూలం. అయితే జూలై నెలాఖరు వరకు కూడా రైతులు విత్తనాలు వేసిన సందర్భాలు గతంలో ఉన్నాయి. పంట దిగుబడులు తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం. వర్షాలు సమృద్ధిగా కురిసి, ఎలాంటి తెగులు ఆశించకపోతే పత్తి దిగుబడులు ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు వస్తుంది. సకాలంలో...

- మిగతా 8వ పేజీలో...



పత్తి విత్తనాలు వేసినా మొలకెత్త లేదు

మే నెలాఖరులో కురిసిన వర్షాలతో పాటు జూన్‌లో అప్పుడప్పుడు కురిసిన వర్షాలతో పత్తి విత్తనాలు విత్తా. ఆ తరువాత వర్షాలు రాకపోవడంతో వేసిన విత్తనాలు మొలకెత్తలేదు. ఈ ఏడాది బాగా వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ పేర్కొన్నా వర్షాలు కురవడటం లేదు. దీంతో వేల రూపాయల పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ వారంలో వర్షాలు లేకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

- బెల్లంకొండ యాదగిరి, చిట్యాల మండలం, మోర్సుగూడెం



వర్షాలు లేక పత్తి మొక్కలు ఎదగడం లేదు

జిల్లాలో ప్రస్తుతం వర్షపాతం లోటుగా ఉండటంతో పత్తి మొలకలు ఎదగడం లేదు. రైతులు ఇప్పటికే 2.22 లక్షల ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తారు. వర్షాలు కురవకపోవడంతో పత్తి మొలకల్లో ఎదుగుదల లేదు. జూలై మొదటి వారంలో వర్షాలు కురిస్తే రైతులు గట్టెక్కుతారు. ప్రస్తుతం రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాలు కురిశాక పత్తి మొక్కలకు ఎరువులు వేస్తే ఏపుగా ఎదుగుతాయి.

- పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ నల్లగొండ

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

అదనపు ఎస్పీ జి.రమేష్

నల్లగొండ క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అదనపు ఎస్పీ బి.రమేష్ అన్నారు. సోమవారం నల్లగొండలోని జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ఆపరేషన్ ముస్కాన్- 11 సమావేశంలో అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జూలై 1 నుండి 31 వరకు నెల రోజుల పాటు పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ వివిధ డిపార్ట్మెంట్ అధికారుల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా మూడు సబ్ డివిజన్ పరిధిలో మూడు టీమ్ లుగా ఏర్పాటు చేసి ఈఆపరేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలలోపు తప్పిపోయిన/ వదిలివేసిన, వివిధ రకాల బాల కార్మికులు కిరాణం షాప్ లలో, మెకానిక్ షాపులలో, హోటళ్లలో, వివిధ కంపనిలలో పనిచేస్తూ, రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు బాలకార్మికులుగా ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం లేదా స్టేట్ హోమ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఎవరైనా బాలల యొక్క స్వేచ్ఛకు, వికాసానికి భంగం కలిగించినా, వెట్టి చాకిరీ చేయించినా అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశ్రమలు, బ్రిక్స్ తయారీ, హోటల్స్ లాడ్జ్, మినరల్ వాటర్ సప్లై, దుకాణాలు, ధాబాలు ఇలా ఎక్కడైనా పిల్లలు వెట్టి చాకిరీకి గురైతే సంభందిత యాజమాన్యాలపై కేసులు నమోదు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి, డిస్ట్రిక్ట్ లేబర్ ఆఫీసర్ అరుణ, ఏహెచ్‌టీయూ ఎస్ఐ రంగారెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి గణేష్, డీసీపీయూ సిబ్బంది తేజస్విని, రమణి, రాము, రేవతి, మహేష్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌తో చెర్వుగట్టు క్షేత్రాభివృద్ధి



ఉన్నత స్థాయి సమీక్ష నిర్ణయాలను విలేకరులకు తెలుపుతున్న శైలజరామయ్యర్

» త్వరలో ఆలయంలో కుంభాభిషేకం చేయిస్తాం
» దేవదాయ, ధర్మాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్

నార్కట్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు దేవస్థానాన్ని మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేస్తామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.వెంకట్రావ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ధార్మిక పరిషత్ ముఖ్య సలహాదారు గోవిందహళ్లితో కలిసి చెర్వుగట్టు పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. తొలిసారి ఇక్కడికి వచ్చిన శైలజారామయ్యర్, ఎమ్మెల్యే, అధికారులకు అర్చకులు ఆలయ మర్యాదల మేరకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రధానాలయం మూలవిరాట్టు సన్నిధిలో జరిగిన పూజల్లో పాల్గొని దేవస్థాన అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, వచ్చే 30 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని ఓ మాస్టర్ ప్లాన్ ప్రకారం క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతీ 12 ఏళ్లకు కుంభాభిషేకం నిర్వహించాలని శాస్త్రం చెబుతున్నాయని పేర్కొన్నారు. త్వరలో ముహూర్తం నిర్ణయించి చెర్వుగట్టులో కూడా కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. పండుగ రోజుల్లో భారీగా వచ్చే భక్తుల సంఖ్యతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నందున రెండో ఘాట్ రోడ్‌ను నిర్మిస్తామన్నారు. రూ.12కోట్ల అంచనాతో దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిరర్థకమనిపించేవి నిలిపివేయాలని నిర్ణయించామన్నారు. గుట్టపైన, కింద పార్కింగ్ స్థలాలు, భక్తుల కోసం డార్మెటరీల నిర్మాణం, స్థపతి సూచనల మేరకు టాయ్‌లెట్ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టాలని ఆమె సూచించారు. కల్యాణమండపం విస్తరణ, మూడుగుండ్లకు వెళ్లే దారిని నడకదారిగా మార్చాలని, శాస్త్రీయ పద్ధతిలో పుష్కరిణి, మెట్ల మార్గాన్ని, క్యూలైన్లను ఏర్పాటు చేస్తామన్నారు. దేవస్థానానికి భక్తులు విరాళాలు, కానుకల రూపంలో సమర్పించుకున్న నగదు డిపాజిట్లు రూ.24కోట్లు, బంగారం 2.640 కి.గ్రాముల బంగారం, 241 కిలోల వెండి ఉన్నట్లు రామయ్యర్ తెలిపారు. దేవస్థానాన్ని సహాయ కమిషనర్ హోదా నుంచి డిప్యూటీ కమిషనర్ హోదాకు పెంచే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ చెర్వుగట్టులో సరైన వసతులు కల్పించాలన్నారు. అమావాస్య రోజు భక్తులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తున్నారని, దీంతో సరైన వసతులు లేక అసౌకర్యానికి గురవుతున్నారని చెప్పారు. ధార్మిక పరిషత్ ప్రత్యేక సలహాదారు గోవింద హళ్లి సూచన మేరకు వచ్చే పరశురామ జయంతి నాటికి దేవాలయంలో ఏదైనా విశేషమైన కార్యక్రమం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట స్థపతి వళ్లియ నాగం, ఆర్కిటెక్చర్ సూర్యనారాయణ మూర్తి, ఎస్ఈ ఓంప్రకాశ్, ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏసీ భాస్కర్‌రావు, దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, రేగట్టె నర్సింహారెడ్డి, నేతకాని కృష్ణయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, గడుసు శశిధర్‌రెడ్డి, వారాల రమేశ్, రేగట్టె నవీన్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేశ్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

ఛాయా సోమేశ్వరుడి ప్రాముఖ్యాన్ని భద్రపరుస్తాం

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): ఛాయా సోమేశ్వర ఆలయాలను భద్రపరుస్తామని శైలజ రామయ్యర్ అన్నారు. సోమవారం ఆమె పానుగల్ లోని ఉన్న శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ఛాయా సోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాక అభిషేకం చేశారు.

ఈ సందర్భంగా ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ ప్రత్యేకత పై ఏమైనా సాహిత్యం ఉంటే ఇవ్వాలని అడిగారు. దేవాలయ చరిత్ర ను తెలుసుకున్న ఆమె దేవాలయ ప్రాముఖ్యతను, అదేవిధంగా శిల్ప విశిష్ఠత, చరిత్ర అన్నింటిని భద్రపరిచేలా చూడాలని ఆర్కిటెక్చర్ సూర్యనారాయణమూర్తి, అలాగే ధార్మిక పరిషత్ సలహాదారు గోవింద హళ్లితో సూచించారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందడం లేదు

మాజీ ఎమ్మెల్యే నోముల భగత్




వినతిపత్రం సమర్పించిన మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నల్లగొండ (కలెక్టరేట్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చాలామంది అర్హులకు అందడం లేదని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. దీనిపై అధికారులను అడిగితే తమకేమీ తెలియడం లేదని సమాధానం చెబుతున్నారని అన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తమ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల గురించి అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అందడం లేదనే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకురావడానికి ప్రయత్నిస్తే తమకు అందుబాటులోకి రావడం లేదన్నారు. కనీసం తమ ఫోన్ కూడా ఎత్తడం లేదని, మాజీ ప్రజాప్రతినిధులమైన తమకే ఇలాంటి పరిస్థితి ఉంటే సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని అన్నారు. తిరుమలగిరి సాగర్ మండలంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారికి, రేషన్ డీలర్ కు మొదటి విడతలోనే ఇండ్లు ఇచ్చారని కానీ, నిరుపేదలకు మాత్రం ఇండ్లు రాలేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక అధికారులు స్పందించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూడాలని కోరారు.

మేలు రకం విత్తనంతోనే మెరుగైన పంట
● పంటల సాగులో విత్తన ఎంపికే ప్రధానం
● వానాకాలం సాగుకు రైతన్నల సమాయత్తం 7

కేతేపల్లి మండలంలో విషాదఛాయలు
● స్వగ్రామాలకు చేరిన మృతదేహాలు 6

వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపాలి



ఆయిల్‌పాం మొక్కనాటి నీరుపోస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వరికి ప్రత్యామ్నాయంగా, అధిక దిగుబడి , ఆదాయాన్నిచ్చే సులభతరమైన, వాణిజ్య పంట ఆయిల్ పాంను సాగు వైపు మొగ్గు చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆమె నల్లగొండ మండలం దండెంపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటరెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో 12.5 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టగా, కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొని మొదటి మొక్కను నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కను ఒకసారి నాటితే 4 వ సంవత్సరం నుంచి నిర్విరామంగా 30 సంవత్సరాల వరకు సరాసరిన ఎకరానికి 10 నుండి 12 టన్నుల దిగుబడిని తీసుకోవచ్చన్నారు. అంతేకాక ఎకరానికి లక్ష ఇరవై వేల నుంచి లక్ష యాభై వేల వరకు నికర ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్ పంటకు జంతువుల నుండి దొంగల నుండి ఎటువంటి బెడద ఉండదని, ఆయిల్ పామ్ వేసిన రైతు ప్రతీ నెల ఆదాయాన్ని తీసుకునే సౌకర్యం ఉంటుందన్నారు. ఇతర పంటలలో ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలు ఎక్కువ అని, అదే ఆయిల్ పామ్‌లో చీడ, పీడల గొడవ ఉండదని, ఈ మొక్కలు ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకొని నిలబడగలుగుతాయని అన్నారు.

ప్రభుత్వం నుంచి ఆయిల్‌పామ్ పంట సాగుకు 100 శాతం రాయితీతో మొక్కలు సరఫరా చేయడమే కాకుండా, మొక్కకు నీరు అందించే డ్రిప్ పరికరాలను రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేగాక మొదటి నాలుగు సంవత్సరాలకు మొక్కల యాజమాన్యానికి ఎకరానికి 4200 రూపాయల చొప్పున ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రైతు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. భూమి, నీటి వనరులు ఉన్న ప్రతీ రైతు సాంప్రదాయ వ్యవసాయ పంటల నుంచి ఆయిల్ పామ్, ఉద్యాన పంటల వైపు రావాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి పిన్నపురెడ్డి అనంత రెడ్డి , పతంజలి ఫుడ్స్ జిల్లా జనరల్ మేనేజర్ యాదగిరి, ఉద్యాన అధికారులు, శ్వేత, రిషిత, నసీమా మరియు ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు ప్రసాద్, మనోహర్, భారత్, రైతులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



ఫిర్యాదులను తీసుకుంటున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ (కలెక్టరేట్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సోమవారం మొత్తం 122 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు 67, రెవెన్యూ శాఖకు 55 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఎప్పటిలాగే ఎక్కువ ఫిర్యాదులు వ్యక్తిగత విషయాలకు సంబంధించి, భూములకు సంబంధించి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి ఉన్నాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, ప్రజావాణి ఫిర్యాదులతో పాటు, ముఖ్యమంత్రి ఫిర్యాదులు, తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఈ వేణుగోపాలాచార్యులు

విద్యుత్ భద్రత సూచనలు పాటించాలి

ఏడీఈ ఎం.వేణుగోపాలాచార్యులు

నల్లగొండ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ భద్రత పాటించాలని నల్లగొండ ఏడీఈ ఎం.వేణుగోపాలాచార్యులు అన్నారు. సోమవారం టౌన్-1 కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ భద్రతా వారోత్సవాల కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 26 నుంచి జూలై 2 వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్‌ను ఆదా చేయడంతో పాటు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే విద్యుత్ అధికారులను సంప్రదించాలన్నారు. వర్షాకాలంలో ఈదురుగాలులు, ప్రకృతి వైపరీత్యాలతో తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిపడడిన స్తంభాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పంట పొలాల్లో విద్యుత్ తీగలు తెగినప్పుడు సంబంధిత విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందరన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈలు, లైన్‌మన్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టుల సమావేశం 6న

మిర్యాలగూడటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఖాజాహమీదుద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్లస్థలాలు అందించాలని, విద్య, వైద్య విభాగాల్లో రాయితీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్రకమిటీ సభ్యుడు వెంకన్న, నాయకులు మహేష్, జిల్లా అధ్యక్షుడు అయాబ్, జయరాజు, సైదులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను ప్రోత్సహించాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలను ప్రోత్సహించాలని మునిసిపల్‌కమిషనర్ శ్రీనివాస్‌ను కోరినట్లు మహిళా సంఘ అధ్యక్షురాలు జాజుల చంద్రకళ తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌కు ఆమె పుష్పగుచ్ఛం అందజేశారు. పొదుపు సంఘాలకు రుణాల జారీలో షరతులు సడలించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు రజిత, భవాని, సరిత, నాగమణి, మాధవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్రకార్యదర్శి ఎండీ. షోయబ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్పీఆర్ స్కూల్‌లో అక్రమంగా నిల్వ చేసిన పుస్తకాలు, నోట్ బుక్స్‌ను గుర్తించి ఎంఈవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ అధికారులపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల ఆగడాలకు అంతులేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో మండలఅ ధ్యక్షుడు అంజియాదవ్, నాయకులు మహేష్, శివ, సురేష్, వినోద్, శివనాయక్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే ప్రగతి సాధ్యం

చింతపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీతోనే దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొడ్డటి మధు తెలిపారు. చింతపల్లిలో సోమవారం ఆయన మాట్లాడుతూ నెల్వలపల్లి గ్రామంలో పీఎం ఆవాస యోజన కింద 23, మొదటి, రెండో విడత కింద 15 మంజూరు చేసినట్లు తెలిపారు.

చినుకు పడితే కరెంట్ కట్


అంగడిపేట ఎక్స్ రోడ్డులోని సబ్‌స్టేషన్

- 132 కేవీ సబ్‌స్టేషన్ లేక కొండమల్లేపల్లి నుంచి సరఫరా
- అయినా తరచూ కరెంట్ సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వ్యాపారులు
- పట్టించుకుని విద్యుత్‌శాఖ, బిల్లులు మాత్రం నెలనెలా వసూలు

వర్షాకాలం వచ్చిదంటే చాలు ఉమ్మడి మండలంలో కరెంట్ కష్టాలు మొదలవుతాయి. చిన్న గాలివాన వచ్చిదంటే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం సర్వసాధారణంగా మారింది. ఉమ్మడిమండలంలో 37 గ్రామపంచాయతీలు వాటికి అనుబంధగ్రామాలు ఉన్నాయి. కాగావిద్యుత్ సరఫరా కోసం ఉమ్మడి మండలంలో ఆరు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. అంగడిపేట ఎక్స్ రోడ్డు, గుడిపల్లి, ఘనపురం, అజ్మాపురం, పుట్టంగండి, దుగ్యాలలో ఏర్పాటు చేసి వాటి ద్వారా ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి, పెద్దఅడిశర్లపల్లి)

మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద దేవరకొండ డివిజన్‌లోనే మూడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు (పీటీఆర్) రెండు 8 ఎంవీఏ, ఒక 8 ఎంవీఏ ఉన్న అతి పెద్ద సబ్‌స్టేషన్‌ను 25 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. మండలానికి 132 కేవీ సబ్‌స్టేషన్ లేకపోవడంతో 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండమల్లేపల్లి నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. దీంతో ఆ మండలంలో కరెంట్ సమస్యలు వచ్చినా కరెంట్ సరఫరా నిలిచిపోతుంది. మండలానికి వచ్చే విద్యుత్ లైన్ల కింద హరితహారం చెట్లు పెట్టడంతో అవి పెద్దగా పెరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో సమస్యను గుర్తించడం సిబ్బందికి కష్టంగా మారుతుంది. దీంతో గంటల పాటు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుంది. ఒక్కోసారి రాత్రంతా విద్యుత్ ఉండకపోవడంతో ప్రజలు జాగారం చేయాల్సి దుస్థితి నెలకొంటుంది. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ద్వారా వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సెల్‌ఫోన్ టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సెల్‌ఫోన్లు మూగపోతున్నాయి. దీనికి ప్రధాన కారణం 133 కేవీ విద్యుత్ లైన్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం, నాణ్యమైన ఇన్సులేటర్లు లేకపోవడమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వ్యాపారం దెబ్బతింటుంది



మండలంలో చిన్నపాటి వర్షం పడినా గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీంతో వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటుంది. తరచూ అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు అధికారులు విద్యుత్ లైన్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

- మల్లిఖార్జున్, జీరాక్స్ సెంటర్ నిర్వాహకుడు

మరమ్మతులు చేపడుతాం

మండలంలో విద్యుత్ లైన్లు ఎక్కువ శాతం హరితహారం మొక్కల పైన ఉండటంతో వర్షాలు కురిసిన సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఈదురుగాలులు వచ్చిన ప్రతీసారి విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నాం. ఇన్సులేటర్లు చెడిపోయిన చోట కొత్త వాటిని ఏర్పాటు చేశాం. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- వసంత్, ఇన్‌చార్జి ఏఈ

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు : బాలునాయక్

● గన్యానాయక్‌తండాలో ఇళ్లకు భూమిపూజ

దేవరకొండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ మండలం గన్యానాయక్‌తండా గ్రామపంచాయతీలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి ఈ సంవత్సరం 3500 ఇళ్లు మంజూరయ్యాయని అన్నారు. ప్రాజెక్టులను పూర్తి చేసి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఎంపీడీవో డానియేల్, మాజీ జడ్పీటీసీ సలహాదారుడు మారేపాకల సురేష్‌గౌడ్, కొర్ర రవినాయక్, కొర్ర రాంసింగ్, అధికారులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

చింతపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్‌లో సోమవారం ఆయన కొద్దిసేపు ఆగారు. గొడకొండ్లలోని శ్రీవేణుగోపాలస్వామి చైర్మన్‌గా ఎన్నికైన అల్వాల జంగయ్యకు నియమాకపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్, అంగిరేకుల గోవర్ధన్, మజహర్‌అలీ బేగ్(పాష), ఎండి.రఫీక్, కిశోర్, అజహర్, మాస భాస్కర్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఏడీఈ రవీందర్‌రెడ్డి

దామరచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులు, సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని మిర్యాలగూడ రూరల్ ఏడీఈ కె.రవీందర్‌రెడ్డి అన్నారు. విద్యుత్ వారోత్సవాల సందర్భంగా దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లోని విద్యుత్ వినియోగదారులకు, విద్యుత్ సిబ్బందికి అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప లు సూచనలు చేశారు. మరమ్మతులు చేసే సమయంలో విద్యుత్ సిబ్బంది ఎల్‌సీలు తీసుకోవాలని, జాగ్ర త్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర

మిర్యాలగూడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌కు అమ్మివేసి కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర చేస్తోందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఇ న్‌చార్జి బొలుగూరి నర్సింహ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డీహెచ్‌పీఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళితులపై దాడులు, వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. రాజ్యాంగాన్ని రద్దుచేసి మనుధర్మశాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం పేదలకు ఉచితంగా అందించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా అందుగుల సైదులు, ప్రధాన కార్యదర్శి వలంపట్ల వెంకన్న సహాయకార్యదర్శి సుందర్, ఉపాధ్యక్షుడు సైదులు, కోశాధికారిగా పోలేపల్లి లత ఎన్నికయ్యారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్, సీపీఐ మం డల కార్యదర్శి రామలింగయ్య, నాయకులు ఉదయ్, లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు.. కినుక

(5వ పేజీ తరువాయి)

విత్తనాలు విత్తకపోతే ఎకరాకు 3 క్వింటాళ్ల నుంచి 5క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తుంది. అది కూడా నాణ్యత లేకుండా వచ్చే అవకాశం ఉంది. దిగుబడి తగ్గితే రైతులు ఆర్థికంగా దెబ్బతింటారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో వ్యవసాయరంగంపై నీలినీడలు అలుముకున్నాయి. జూలై మొదటి వారంలోగా వర్షాలు సమృద్ధిగా కురిస్తే మెట్ట రైతులు కొంతలో కొంత పెట్టుబడులతోనైనా బయట పడతారు. లేదంటే లక్షల రూపాయల పెట్టుబడులను రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

భారీగా పెట్టుబడులు పెట్టాం

వ్యవసాయానికి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాం. వర్షాలు జాడ లేకుండాపోయాయి. వర్షాలు రాకపోతే పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. వర్షాలు లేక బోర్లు కూడా ఎండిపోయాయి. బోర్లు ఆగి ఆగి పోస్తుండటంతో నారుమళ్లు కూడా తడవడం లేదు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడంతో పంటల దిగుబడులు కూడా తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

- కె.శంకరయ్య, రేగట్టె, కనగల్ మండలం

జిల్లాలో లోటు వర్షపాతం ఇలా..

మండలం	లోటు వర్షపాతం
నార్కట్‌పల్లి	-58.1మి.మీ
కట్టంగూరు	-42.2మి.మీ
శాలిగౌరారం	-69.0మి.మీ
నల్లగొండ	-61.3మి.మీ
కనగల్	-51.1మి.మీ
అనుముల	-71.3మి.మీ
నిడమనూరు	-67.9మి.మీ
వేములపల్లి	-62.5మి.మీ
మిర్యాలగూడ	-57.0మి.మీ
తిరుమలగిరి(సాగర్)	62.8మి.మీ
పెద్దవూర	-50.మి.మీ
గుర్రంపోడు	-67.1మి.మీ
గుడిపల్లి	-43.6మి.మీ
చండూరు	-47.9మి.మీ
నాంపల్లి	-58.4మి.మీ

భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

దామరచర్ల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమ ఏర్పాటు సమయంలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. పరిశ్రమ పనులు ప్రారంభమై ఎనిమిదేళ్లవుతున్నా నేటి వరకు భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి భూముల కోల్పోయని రైతు కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పేరుపొంగు సైదులు, పేరుపొంగు మట్టయ్య, దర్శనం రాజా, రేగూరి భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

దామరచర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల నాయకుడు భైరం దయానంద్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె.సుభాని, డి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్

దేవరకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం దేవరకొండలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. బీసీలందరూ ఐక్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి బీసీలకు సరైన ప్రాధాన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పున్న వెంకటేష్, నాయకులు శీను, ముషిని వీరయ్య, లక్ష్మణ్‌నాయక్, ఖాదర్‌బాబా పాల్గొన్నారు.

విద్యుత్ ఇన్‌చార్జి ఏఈగా దేవోజీనాయక్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఈ దేవోజీనాయక్

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పీఏపల్లి మండల విద్యుత్ ఇన్‌చార్జి ఏఈగా నేనావత్ దేవోజీనాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొండమల్లేపల్లి విద్యుత్ ఏఈగా పనిచేస్తున్నారు. అదేవిధంగా పీఏపల్లి మండల ఇన్‌చార్జి ఏఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో సోమవారం ఏడీఈ సైదులు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏఈ దేవోజీ నాయక్ మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం లేకుండా తనవంతు సేవలు అందించడానికి ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

నిడమనూ రు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపి ణీ చేయాలని తహసీల్దార్ జంగాల కృష్ణ య్య డీలర్లకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డీలర్లతో నిర్వహించిన నెలవారీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మూడు నెలల సన్నబియ్యం విజయవంతంగా పంపిణీ చే శారని డీలర్లను అభినందించారు. కొత్తగా నియమితులైన ముగ్గురు డీ లర్లను అభినందించి వారికి తగిన సూచనలు చేశారు. సమావేశంలో ఆర్ఐలు దాడి రాజిరెడ్డి, సందీప్, మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు మృతి


భగవంతరావు (ఫైల్)

డిండి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు దొంతినేని భగవంతరావు(62) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. భగవంతరావు గతంలో టీడీపీ మండల అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. యూఎస్ఏలో ఉంటున్న భగవంతరావు సోదరి, కుమార్తె వచ్చిన తర్వాత గురువారం స్వగ్రామంలో భగవంతరావు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి వివిధపార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

ప్రజావిశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్: టీడీపీ

మిర్యాలగూడ టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మితిమీరిన తెలివి తేటలు ప్రదర్శించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజావిశ్వాసం కోల్పోయిందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ అగ్రనేతలు నోరు అదుపులో పెట్టుకోకపోవడం వల్లే ప్రజలకు దూరమయ్యారని విమర్శించారు. మీడియాపై అల్లరి మూకలు చేసిన దాడిని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఖండించకుండా టీడీపీ, ఏపీ సీఎం చంద్రబాబుపై విమర్శలు గుప్పించడం అవివేకమన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభాసుపాలు చేసిన బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తులో పుట్టగతులుండవని అన్నారు. సమావేశంలో పార్టీ వాణిజ్య సెల్ కన్వీనర్ ఏచూరి అనంతరాములు, నాయకులు చావల వెంకటేశ్వర్లు, పోట్ల శంకర్‌రావు, దాసోజు కాంతాచారి, లావూడి లింగానాయక్ పాల్గొన్నారు.

బస్సు టైర్ కింద పడిన వృద్ధురాలికి గాయాలు

కొండమల్లేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ వృద్ధురాలు బస్సు ఎక్కే క్రమంలో జారి పడింది. అదే సమయంలో ఆమె కాలు పైనుంచి బస్సు వెళ్లడంతో నుజ్జయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవూర మండలంలోని కల్వకుర్తి గ్రామానికి చెందిన ముదిరెడ్డి ప్రమీల హైదరాబాద్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లి స్వగ్రామానికి చేరుకోవడానికి కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు దిగింది. అనంతరం వృద్ధురాలు తన స్వగ్రామం కల్వకుర్తికి వెళ్లేందుకు మిర్యాలగూడ బస్సు ఎక్కే క్రమంలో నల్లగొండ బస్సు ఎక్కింది. కానీ అందులో ఉన్న ప్రయాణికులు మిర్యాలగూడ బస్సు కాదని చెప్పడంతో బస్సు దిగే క్రమంలో జారి కిందపడింది. బస్సు టైర్ ఎడమకాలుపై వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యింది. వెంటనే బస్టాండులోని స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీర రమేష్ తెలిపారు.